# మనసు పావన గంగ



సుధామ

# మనసు పావన గంగ

(పాటలు)

సుధామ

సఖీకుమారి ప్రచురణలు
హైదరాబాదు. 36

**MANASU PAAVANA GANGA**
(LYRICS)
BY
**SUDHAMA**
9849297958

**2.7.2010**
COPIES : 500

PRICE : Rs. 75/-

PUBLISHED BY:
**© SAKHI KUMARI PRACHURANALU**
G.12, SADATH TOWERS, PADMAVATHI APARTMENTS
SALEEMNAGAR COLONY, MALAKPET,
**HYDERABAD. 500 036 (A.P.)**
040-24545780

COVER DESIGN
**CHANDRA**

LAYOUT & DTP
**NIRMALA**
9885729723

PRINTED AT
**OM SAI GRAPHICS** (MULTICOLOUR OFFSET PRINTERS)
3-4-709, NARAYANAGUDA (NEAR FLYOVER)
HYDERABAD - 27.

FOR COPIES
PUBLISHERS ADDRESS &
VISALANDHRA BOOK HOUSE,
NAVAYUGA BOOK HOUSE,
PALAPITTA BOOKS, HYDERABAD
AND OTHER LEADING BOOK SHOPS.



నా
బతుకు పాటకు పల్లవి
జీవన స్నేహ చరి
ఉషారాణి కి –

లలిత గాంధర్వ కళానిధి
లలిత సంగీత సామ్రాట్
మధురస్వర నిధి, కళారత్న
స్వరజ్ఞాన సుధార్ణవ
**డాక్టర్. ఎమ్. చిత్తరంజన్**
వోకలిస్ట్ & మ్యూజిక్ డైరెక్టర్



ఇంటి నెంబర్: 1-1-319/1, ప్లాట్ నెం. 42, బాలాజీనగర్ కాలనీ, రోడ్ నెంబరు 4,
మోహన్‌నగర్, కొత్తపేట్, హైదరాబాద్ - 500 035. ఫోన్: 9866127993

# 'సుధామ'ధుర గీతాలు

"ఎల్లలెరుగని వాళ్ళము కల్లలెరుగని వాళ్ళము
బాలలం మేమొక్కటే లోకమూ మా కొక్కటే"

కల్లాకపటమెరుగని అమలిన మానసము గలవారు పిల్లలు. తిండేదైనా, తీరేదైనా, మాట్లాడే భాషేదైనా, నివసించే దేశమేదైనా బాలలంతా ఒకటేనని, సకల ప్రపంచమంతా నిరంతరం సంతోషంతో కళకళలాడాలని వారు కోరుకుంటారు. అదే ప్రపంచ బాలల సందేశం, సుధామ రచించిన యీ గీతంలో. ఇది అంతర్జాతీయ బాలల సంవత్సర గీతం. 1979వ సంవత్సరంలో బాలల కోసం చక్కని ఈ గీతంతో గేయ రచనకు శ్రీకారం చుట్టారు సుధామ. ఆకాశవాణి బాలల కార్యక్రమాల ప్రయోక్తగా వుండిన శ్రీమతి తురగా జానకీరాణి, నేను ప్రోత్సహించగా యూనిసెఫ్‌సందేశం ఆధారంగా, నా సంగీత సారథ్యంలో రూపుదిద్దుకుని ఆ పాట ప్రసారమయింది. ఆ ఏడాది రవీంద్రభారతి వేదికపై వందమందికి పైగా బాలలు బృందగీతంగా ఆ పాటను పాడారు.

బాలల కోసమే సుధామ రచించిన మరొక గీతం -

"కంటి చూపులం మింటి ఆశలం - అమ్మా నాన్నల కలల రూపులం
పిల్లలం మేం పిల్లలం - కొత్త శతాబ్దికి దూతలం

రేపటి కాలపు నేతలం"

చిన్నారి బాలలు ఆ పసివయసులో ఆటపాటలతో బాటు విద్యా బుద్ధులు నేర్వాలి. నేర్చిన ఆ విద్యతో సమసమాజ నిర్మాణానికి పాటుపడాలి. అదే వారి ధ్యేయం. చాచా నెహ్రూ ఆశించిన శాంతిని ఎల్లెడలా నెలకొల్పడానికి శ్రమించడమే వారి ఆశయం. భావి పౌరులుగా బాధ్యతాయుతంగా జీవించడమే వారి కర్తవ్యంగా యీ గీతంలో తెలిపారు కవి.

నిజానికి పిల్లలకోసం పాట రాయడం అంత తేలికైన విషయం కాదు. ఎందుకంటే పిల్లల మనస్తత్త్వాన్ని బాగా అవగాహన చేసుకుని వాళ్ళకి అర్థమయే రీతిలో, వాళ్ళ నోట సులభంగా పలికే మాటలతో గీతం రూపొందించవలసి వుంటుంది. అలా అన్ని విధాలా సుందర గీతంగా మలచి, మొదటి పాటతోనే తన ప్రతిభను చాటుకున్నారు సుధామ.

ఈ గీతికా గుచ్ఛంలో వస్తు వైవిధ్యం గల అనేక రచనలున్నాయి.

"కులములో ఏముంది గుణములోనే వుంది
మతములో ఏముంది మమతలోనే వుంది

..................

వ్యాకులము తొలగించు కరుణయే కులము
మమత పెంచుకు మసలు మానవతె మతము

..............

ప్రతి మనిషి హృదిలోన యీ భావబిందువే జనియించి సాగితే
మనసు పావన గంగ మనసు గోదావరి
మలినమంటని మనసు మధుర కవితాఝరి"

నిజమే మరి! కులము కంటే గుణము, మతము కంటే మమత గొప్పవి. మమతతో నిండిన మానవత్వమే అసలైన మతముగా భావించే మనసు, మలినాన్ని ప్రక్షాళనం చేసే పావన గంగయే అవుతుంది. ఎంత చక్కని భావన! మానవత్వపు విశిష్టతను చాటే మధుర గీతమిది.

పద్యం, గద్యం, వచన కవిత మొదలగు వాటికి, గేయ ప్రక్రియకి

కొంత వ్యత్యాసముంది. గాన యోగ్యమయినది గేయం. కాబట్టి గేయకవికి సంగీత పరిజ్ఞానం కొంతైనా అవసరం. అలాగని సంగీత శాస్త్రమంతా తెలియనక్కరలేదు. కాని స్వర రవళులకు స్పందించే హృదయం ఉండాలి. అదే విధంగా గేయానికి బాణీ కూర్చే స్వరకర్తకి కూడా కొంత సాహిత్య పరిజ్ఞానం అవసరం. పదాలలోని భావ సౌరభాన్ని ఆస్వాదించి స్పందించ గలగాలి. అప్పుడే మాట, పాట అనగా మాతువు, ధాతువు ఒక దానితో ఒకటి పెనవేసుకుని, విడదీయరాని అనుబంధంతో, పూవు, తావి చందాన అమరిపోతాయి. అలాంటి గేయం పదికాలాల పాటు నిలుస్తుంది. అందరినీ అలరిస్తుంది. అటువంటి పాటలు సుధామ రాసిన యీ గ్రంథంలో చాలా కనిపిస్తాయి మనకు.

పాటలోని మాటలు చదవగానే మనసుకు స్పందన కలిగి సంగీతం స్ఫురించాలి. అలాంటి పదాలలో సంగీతం అంతర్భూతంగా వుంటుందన్న మాట! ఉత్తమ గీతరచనకుండే గుణమిదే. సుధామ కలం నుండి జాలువారిన గేయాలలో యీ గుణం సుస్పష్టంగా కనిపిస్తుంది. అందుకే ఎంతోమంది స్వరకర్తలు వీరి గేయాలన్నిటినీ స్వరబద్ధం చేశారు. ఆ వివరాలు కూడా యీ పుస్తకంలో కవి పొందుపరిచారు.

"శాంతి కిరణ మాలికలను అల్లుకునే ఆవరణలో
రణవర్ణపు తోరణాలు కట్టకూడదు
..............
ఆవేశం కాదు మనకు ఆలోచన కావాలి
హింసా మోసం కాదు యిలను శాంతి సుమం విరియాలి
గణనీయపు గణతంత్రం మనదీ మనదీ
ప్రజాస్వామ్య ఆభరణం......."

భారతీయులు శాంతి కాముకులు. ఎన్ని సమస్యలొచ్చినా, ఎటువంటి కష్టాలొచ్చినా, ఆవేశంతో కాక, ఆలోచనతో శాంతియుతంగా పరిష్కరించు కోవాలి. హింస, మోసం విడనాడాలి అంటూ గణతంత్ర దినోత్సవాన్ని

పురస్కరించుకుని సుధామ రచించిన యీ ప్రబోధగీతం 26. 1. 89 నాడు ఆకాశవాణిలో 'మాతృ వందనం' కార్యక్రమంలో నా సంగీతంతో రూపొంది ప్రసారమయినది.

"హిత సేతువు సుఖహేతువు కాని మతం మనకొద్దు
మానవ సేవా ఫలితం మాధవసేవే సతతం
కల్మషమెరుగని హృదయం ఈశ్వర్ అల్లా నిలయం"

కడు నేర్పుతో పదాల కూర్పుతో సముచిత భావ సౌరభంతో గుబాళించే మత సామరస్య గీతం.

దీపావళికి సంబంధించిన గీతం:-

"తిమిరాలను ఛేదించే సమరాలే దీపాలు
అజ్ఞానం అనైక్యతే చీకటింటి శాపాలు
తాను తనదను తపనల తహతహలే తమస్సులు
పదుగురికై ప్రగతి మార్గ ప్రణాళికలె ఉషస్సులు
రోదనలూ వేదనలూ తొలగించే హవిస్సులు
పేదరికం అధిగమించు భాగ్య సూత్ర రోచిస్సులు
కోపాలను తాపాలను హరియించే సమభావం
గుండె గుండెలో వెలిగే స్నేహ భావనా దీపం
కాంతి శాంతి కలబోసిన క్రాంతి హేల చిద్రూపం
ఉజ్జ్వల చైతన్యమూర్తి ప్రతిమనిషీ ఒక దీపం"

స్వార్థమే తమస్సనీ, పదిమందికి కలిగే అభివృద్ధే ఉషస్సనీ, కోపతాపాలను విడిచిన ప్రతిమనిషీ స్నేహభావనతో జ్ఞాన దీపకాంతుల వెదజల్లే ఉజ్జ్వల చైతన్యమూర్తి అనీ నేటి మానవాళికి చైతన్యం కలిగించే చక్కని సందేశాత్మక గీతం.

ఇదే అంశాన్ని మరొక విధంగా -

"వెలిగించిన జ్ఞాన ప్రమిద
మహనీయుల త్యాగ సమిధ

సమసమాజ నిర్మాణం

సమకట్టిన అగ్ని సుధ"

అంటూ అర్ధవంతమైన పద మాధుర్యం తోను, అంత్యానుప్రాస తోను రమ్యంగా చెప్పారు కవి సుధామ.

"శయన రంభయని సహనమూర్తి యని యాతనలెన్నో పెడతారు

ఇంటికి దీపం యిల్లాలంటూ అగ్నికి ఆహుతి చేస్తారు

మగవారల విజయం వెనుక ఉన్నది మగువంటారు

అపజయాలనే అతివలకిచ్చి నిచ్చెనగా దాటేస్తారు".

"కార్యేషు దాసి కరణేషు మంత్రీ........శయనేషు రంభ.........."

అన్న నానుడి అందరికీ తెలిసిందే.

స్త్రీని సహనమూర్తి యని, ఇంటికి దీపమని కొనియాడుతూనే నానా బాధలూ పెడతారు. రోజూ పత్రికలు తిరగేస్తే మనకు తారసపడే వార్తలు యివే – స్త్రీల మానభంగాలు, కట్నం కోసం అతివలను పెట్టే బాధలు, హత్యలు వగైరా. ఇటువంటి

"చిక్కులు పోవాలంటే హక్కులకై పోరాడాలి

మహిళా జనగణమంతా కూడి జాగృత గీతం పాడాలి"

అంటూ మహిళల హితముకోరే యీ గీతం మహిళా జాగృత గీతంగా వెలువడి ప్రసారమయింది.

ఇలాంటిదే మరో గీతం –

కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింట వుండదంటారు

సిరుల కోసమే కన్నె బతుకులో ఉరులు పన్ని చితివేస్తారు.

ఎటు పోతున్నది సభ్య సమాజం అని ఎవ్వరు తర్కిస్తారు"

అంటూ ఎంతో ఆవేదనతో కవి మహిళల పట్ల చూపిన సానుభూతి యీగీతం యొక్క సారము.

గాంధీజీపై రాసిన గీతం –

"తాతంటే తాత కాదు దేశానికి త్రాత

మహాత్ముడే మన పాలిటి స్వేచ్ఛా ప్రదాత

మాటే ఒక మంత్రంగా ప్రజను కూడగట్టి
ఉప్పు కూడ నిప్పులాగ ఆంగ్లేయుల భయపెట్టి
.................
శత్రువులను పారిపోగ తరిమికొట్టినట్టి నేత
(2వ చరణంలో కూడా అంత్యాను ప్రాస పదం ఇక్కడ విశేషం)
...............
ప్రపంచాన గాంధేయం శాంతి చిహ్నమని తెలిపి
భక్తి తోడ అందిద్దాం మనసారా జోత"

ఈ గీతంలో కనబడేవి ప్రముఖంగా రెండు విశిష్టతలు.

ఒకటి – హిందీ గీతాలలో వలె పల్లవిలోని అంత్యానుప్రాసను ప్రతి చరణం చివరి పంక్తిలో పాటించడం. ఉర్దూ భాషలోని గజల్‌లో యీ అంశం ఎక్కువ ప్రాముఖ్యతను కలిగి వుంటుంది. అనివార్యం కూడా. ఆ సాహిత్య ప్రక్రియకి యీ అంశం ఒక శోభను చేకూర్చుతుంది. అదే విధంగా తెలుగు గీతంలో కూడా సుధామ ఆ అంశాన్ని కడు సమర్థ వంతంగా పాటించి అందంగా మలచారు యీ గీతాన్ని. రెండవ విషయం – గీతం రాసేటప్పుడు చెప్పదలచుకున్న విషయం పాతదైనా చెప్పే విధానమైనా కొత్తగా వుండాలి. లేక విషయం కొత్తదై చెప్పే విధానం పాతదైనా కావచ్చు. విషయమూ కొత్తదై (అనగా అంతకు ముందెవ్వరూ చెప్పనిది), చెప్పే విధానము కొత్తదై వుంటే ఆ రచన భావితరం వారికి ఆదర్శ ప్రాయంగాను, ఒక ట్రెండ్ సెట్టర్‌గాను నిలుస్తుంది. గాంధీగారిపై ఎంతో మంది ఎన్నో అద్భుతమైన గేయాలు రాశారు. ఆయనను ఎన్నో విధాల కీర్తించారు. అయితే సుధామ తన గీతంలో గాంధీజీని దేశానికి రక్షకుడుగా భావించి 'త్రాత' అని సంబోధించడం సమంజసంగాను, నూతనంగాను వున్నది. ఈ పాటలో పల్లవి, చరణాలలో త్రాత, ప్రదాత, నేత, జోత వంటి పదాలతో కడు సమర్ధవంతంగా అంత్యానుప్రాసతో

రక్తి కట్టించారు. విషయం పాతదే అయినా చెప్పే విధానంలో నవ్యతను చేకూర్చారు సుధామ. ఆయన చేసిన యీ ప్రయత్నం ఎంతో ప్రశంసార్హమైంది.

"గుప్పిటలో యిసుకలాగ రాలిపోవు కాలం
కాలరేఖ ఆసాంతం మహా ఇంద్రజాలం
ఎంత చక్కనైనా గతమంతా ఒక స్వగతం
వర్తమాన మనుసరించు ఆగామికి స్వాగతం"

"పీడకలల చీడ నడల జాడలు విదిలిస్తూ
ఆశల శైలూషిక నర్తనాల పులకిస్తూ
గతవత్సర అనుభవాలు గతుల నింక సవరించును
నవ వత్సర స్నేహకాంతి నవజీవన మందించును"

కాలం ఎన్నడూ ఎవరి కోసమూ ఆగదు. Time and tide wait for none అని ఇంగ్లీషులో కూడా యిదే విషయాన్ని చెబుతారు విజ్ఞులు. కాలం ఒక మాయాజాలం. గతించిన కాలం ఎంత చక్కనిదైనా జ్ఞాపకంగా మిగిలిపోయేదే కానీ తిరిగి రాదు కదా! మానవుడు ఆశాజీవి. కనుక గతంలో ఎన్ని కష్టాలు, బాధలు ఎదురైనా వాటిని పీడకలగా తలచి, విదిలించుకుని, మదిలో ఆశల హర్మ్యాన్ని సృష్టించుకుంటాడు. భవిష్యత్తంతా సుఖమయం కావాలని కోరుకుంటాడు. ఆ ఆశతోనే గడచిన సంవత్సరానికి వీడ్కోలు చెప్పి, నూతన వత్సరానికి స్వాగతం పలుకుతాడు. ఈ గీతంలో "గతమంతా ఒక స్వగతం", "గత వత్సర అనుభవాలు గతులనింక సవరించును" వంటి పద ప్రయోగాలు బాగున్నాయి. మానవుడు తన అనుభవాలనుంచే తన నడకను, నడతను సవరించుకోవడం జరుగుతుంది. 'కాలరేఖ' శీర్షికన కవి సుధామ యీ గీతంలో యీ విషయాలను వివరించిన తీరు హృద్యంగా వున్నది.

"ఏకాంతం తీగె మీద విరహాశ్రువు జారింది
కలల సెగల మీద కనుల తడిని ఆరవేసింది
మరపు తెరల మాటున మధురోహలు నిదరోయి
నిట్టూర్పుల నీడ తోనె నడచి వచ్చెనో హాయి
గతమంతా ఒక స్వగతం వేదన సహజాతం
హఠాత్తుగా అదృశ్యం వెన్నంటే సహచర్యం
తిమిరాలను ఛేదించే దీపకళిక కద ధైర్యం
ఆగిపోదు బతుకు బండి గమనం అనివార్యం"

విరహ వేదన బాధాకరమే. అయినా ఆ బాధకు కృంగిపోక అందులోనే సుఖముందని, విరహపు చింతనలోనే ఆనందాన్ని పొందుతూ, ఆ బాధనే ప్రేమిస్తూ, ధైర్యాన్ని కూడ గట్టుకుని జీవన యానం సాగించాలి అన్నది యీ గేయం యొక్క సారాంశం. సుధామ యొక్క పదాల ఎంపిక, వాటి పొందిక, వాటిని వినియోగించిన విధానము శ్లాఘనీయం.

★ "రాగం తీస్తే సంగతివేస్తే గాత్రం ప్రవహిస్తుంది
మౌనం కరిగీ మాట పాటగా మనసు పరవశిస్తుంది"

★ "స్వాతంత్ర్యం నా పేరు భారతం నా ఊరు
ప్రతినిత్యం మహోదయం నా హృదయం కోరు"

★ "మనసు మురియగ మధురగీతిని పాడుతా యీ వేళలో
గుండె లోపల గువ్వపిట్టలు రెక్క విచ్చిన హాయితో"

★ "విరితోటల ఆవిరులను పురికొల్పిన భ్రమరమా
విరి కన్నెల దరిచేరగ మరలే సంభ్రమమా"

★ "తలపు తలుపు తట్టినంత తెరుచుకున్న ఆమని
జాబుకు ఒక జవాబులా పలుకుతుంది ఏమని"

ఇలా వివిధాంశాలకు సంబంధించిన గేయాలెన్నో యీ కావ్యంలో వున్నాయి. అలతి అలతి పదాలతో అనల్పమైన భావాలను వ్యక్తపరచడమే

కదా లలితగీతానికుండే విశిష్టత! ఏ విషయం చెప్పినా దానికి సమతుల్యమౌ పదాలతోను, సముచితమౌ భావాలతోను తనదైన శైలిలో ఒక ప్రత్యేకతను, నవ్యతను చేకూర్చేందుకు ప్రతి గేయంలోను కవి సుధామ చేసిన కృషి అభినందనీయం.

ఆకాశవాణిలో ఉద్యోగిగా పనిచేయడం వలన కొన్ని లాభాలు వున్నాయి. అనేక సన్నివేశాలు, సందర్భాలు, పండుగలు, వేడుకలు వివిధ అవసరాలకు మన కళను ప్రదర్శించడానికి అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటూ మనం రాణించవచ్చు. ఏ సంస్థయినా ఉద్యోగాన్నిచ్చి పోషిస్తుంది. కాని ఆకాశవాణి మాత్రం ఉద్యోగాన్నిచ్చి పోషించడమే కాకుండా, పేరు ప్రఖ్యాతులను కూడా ప్రసాదిస్తుంది. మా తరం తరువాత అలా సద్వినియోగం చేసుకుంటూ కళలకు 'సుధామ' మైన ఆకాశవాణిలో సుధామ గణనీయమైన సేవలందించారు. ఆ సంస్థకు ఆయన ఒక అస్సెట్.

భాష, భావం – యీ రెండిటిపై చక్కని పట్టు సాధించారు సుధామ. ఆయన ప్రచురిస్తున్న యీ కావ్యంలోని గేయాలన్నీ అందుకు బలమైన తార్కాణాలు. నాకు అత్యంత ఆత్మీయుడు, సోదరుడు, అయిన ప్రముఖ కవి సుధామకు మనసారా అభినందనలు తెలియజేస్తున్నాను.

ఈ పాటలు నిరంతరం గాయనీగాయకులచే గానం చేయబడుతూ రసిక జన చిత్తరంజనం గావించాలని కోరుకుంటున్నాను.

10.3.2010 భవదీయుడు
హైదరాబాద్ **మహాభాష్యం చిత్తరంజన్**

# పాట మాట ...

ఇవి నా పాటలు. కవిత్వం అంటే ముందునుంచీ నాకు ఇష్టం. నా సాహితీయాత్రలో కవిత్వానికే ముందడుగు. అయితే పాటలు రాయడం అనేది వృత్తిరీత్యా 1978లో ఆకాశవాణిలో అడుగుపెట్టాకే జరిగింది. నా అంతట నేనే ముందు ఓ పాట రాసుకున్న సందర్భం లేదు. ఇందులోని ప్రతి పాటా అడిగితే రాసిందే. అలా ఇవన్నీ ఆకాశవాణిలో, దూరదర్శన్‌లో ప్రసారమైనవే. నాకు అందుకు అవకాశాలు కల్పించి, నా చేత పాటలు రాయించింది ఆకాశవాణి. రేడియోలో ముందస్తుగా పాట రాయించింది రేడియో పిల్లల కార్యక్రమాల ప్రొడ్యూసర్ శ్రీమతి జానకీరాణి అక్కయ్య గారు.

1979 అంతర్జాతీయ బాలల సంవత్సరంగా ప్రకటిస్తూ యునిసెఫ్ ఇచ్చిన సందేశం స్ఫూర్తితో తొలిసారిగా 'బాలలం మేం ఒక్కటే' అనే పాటను నేను జానకీరాణిగారు కోరి ప్రోత్సహించగా రాశాను. లలిత సంగీతకర్త శ్రీ చిత్తరంజన్ దానికి సంగీతం సమకూర్చారు. ఆ పాట చాలా ప్రాచుర్యం పొందింది. నేడు ప్రముఖ సంగీత దర్శకులుగా రాణిస్తున్న లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమి నిర్వాహకుడు శ్రీ కె. రామాచారి, సినీ టీవీ సంగీత దర్శకుడు 'బంటి' నాడు బాలలుగా ఆ పాట పాడిన వాళ్లలో వున్నారు. తదనంతర కాలంలో నా పాటలు కొన్ని వారిద్దరి సంగీత దర్శకత్వంలోనూ రూపొంది ప్రసారం కావడం ఓ విశేషం! "బాలలం మేం ఒక్కటే' అనే ఆ ప్రపంచ బాలలగీతి హైదరాబాద్ రవీంద్రభారతి వేదికపై వందలాదిమంది పిల్లలు గానం చేయడం, మద్రాస్‌లో జరిగిన

చిల్డ్రన్స్ ఫిలింఫెస్టివల్ సందర్భంగానూ అధికసంఖ్యలో పిల్లలు పాడడం ఆ పాట గతంలో నాల్గవ తరగతి ప్రభుత్వ పాఠ్యం గ్రంథంలోనూ, ఇప్పుడు 'పెద్ద బాలశిక్ష' గ్రంథంలోనూ చేరడం నాకు ఆనందదాయకమైన గొప్ప సంగతి.

అది మొదలు శ్రీ చిత్తరంజన్‌గారి ప్రోద్బలంతోనూ ఆకాశవాణి లలితసంగీత విభాగం కార్యక్రమ నిర్వహణాధికారులుగా పనిచేసిన శ్రీ డి. ప్రసాదరావు, శ్రీమతి ఉషారాణి, శ్రీ కలగా కృష్ణమోహన్ వంటివారు నా మీద నమ్మకంతో, అభిమానంతో కోరి రాయించగానూ, మరీ ముఖ్యంగా పిల్లలకోసం శ్రీమతి తురగా జానకీరాణిగారు వెన్నుతట్టగనూ, వారు వారు అడిగినప్పుడల్లా కాదనకుండా అవకాశాలు అందిపుచ్చుకుని పాటలు రాస్తూ వచ్చాను. నేను సెలవులో వున్నా శ్రీ డి. ప్రసాదరావుగారు ఇంటికి టెలిగ్రాం పంపుతూ అర్జెంటుగా రెండుపాటలు రాయమని కోరడం మరిచిపోలేను!

ఔను. ఇవన్నీ ప్రధానంగా ఆకాశవాణి పాటలే! అంచేత దేశభక్తి, మతసామరస్యం, పిల్లలకు సందేశగీతాలూ ఎక్కువ. ప్రభాతగీతాలుగా, బృందగానాలుగా ప్రసారమైన పాటలు ఉన్నాయి. ప్రణయం, విరహం, ప్రకృతి, పర్వం వంటి లలిత భావగీతాలు కొన్ని 'ఈ మాసపు పాట'లుగా 'పక్షగీతిక'లుగా ప్రసారమయ్యాయి. లలితసంగీత పాఠాలుగా, పాఠశాల విద్యార్థుల కార్యక్రమంలో 'ఈ పాట నేర్చుకుందాం'లో నేర్పడానికి రాసిన పాటలున్నాయి. గాంధీ, రాధాకృష్ణన్ గురించీ, దీపావళి, కొత్త సంవత్సరం గురించీ రాశాను.

శ్రీ పి.వి. సాయిబాబా తొలిసారి నా దేశభక్తి గీతాలు స్వరపరిచాడు. శ్రీ నల్లూరి సుధీర్‌కుమార్ దూరదర్శన్ కోసం అడిగి పాటలు రాయించుకుని, తను సంగీతం సమకూర్చి, మంజులా ఉదయకుమార్ వంటి గాయనీమణితో బాటు స్వయంగా పాడీ ప్రాచుర్యపరిచాడు. సహజంగా ప్రభాతగీతాలుగా, బృందగానాలుగా ప్రసారమైన గీతాల్లో చర్విత చర్వణ భావాలు కనబడవచ్చు. వాటిని పునరుక్తులుగా కాక దైవభక్తి లేకున్నా మాతృభక్తి తరువాత దేశభక్తి ఉండితీరాలన్న జాతీయతా

భావస్ఫూర్తికి పునరుద్ఘాటనలుగా భావించమని మనవి. ఒకే భావానికి వివిధ అభివ్యక్తి రూపులు కొన్ని.

నేను నా మూడుపదుల కాలపు వృత్తి జీవితంలో ఆకాశవాణికై ఇలా అవసరార్థం రాసిన పాటలు హైదరాబాద్, విజయవాడ కేంద్రాలలో ఎందరు సంగీతదర్శకుల చేతనో వైవిధ్యభరితంగా స్వరపరచబడ్డాయి. శ్రీ కె.బి.కె. మోహనరాజు, శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి, శ్రీ తిరుపతి త్యాగరాజు, శ్రీమతులు వి. కనకదుర్గ, ఛాయాదేవి, విజయలక్ష్మీ శర్మ, జ్యోతి రామకృష్ణ, సురేఖామూర్తి, శారదా వెంకటరమణ, వినయమణి వంటి వారూ, శ్రీ మల్లిక్, శ్రీ చిత్తరంజన్ గారలు కూడా కొన్నింటిని పాడడం, అలాగే శ్రీయుతులు మల్లిక్, చిత్తరంజన్, మల్లాది సూరిబాబు, కృష్ణరంగం, ఘంటశాల విజయకుమార్, ఉషాకాంత్, పి.వి. సాయిబాబా, నల్లూరి సుధీర్ కుమార్, సురేంద్రనాథ్ కాలే, మోహనకృష్ణ, ప్రఖ్యా ఆంజనేయ శాస్త్రి, రత్నకుమార్, ఉదయకుమార్, ప్రీతమ్, ఆర్. గోపాలకృష్ణ, వి.కె. ఇలియాస్, కలగ కృష్ణమోహన్, కె. రామాచారి, బంటి, శ్రీమతి కె. శోభారాణి వంటి సంగీత దర్శకులు ఈ పాటలకు స్వరాలు కూర్చడం నా సాహిత్యానికి వన్నె వాసి తెచ్చిపెట్టాయని నా భావన.

రేడియోలో ఈ పాటలు ప్రసారమైనప్పుడు ఎందరెందరో శ్రోతలు అభినందన లేఖలు రాశారు. ఫోన్‌లు చేసి ప్రశంసించారు.

ఈ సంపుటికి పెట్టిన 'మనసు పావన గంగ' పేరిటి పల్లవితో ఇందులో రెండు పాటలున్నాయి. పల్లవి ఒకటే కానీ చరణాలు వేరు. ఒక పాట హైదరాబాద్‌లో కృష్ణరంగం సంగీతం సమకూర్చింది. మరొకటి విజయవాడ కేంద్రంలో శ్రీ మల్లాది సూరిబాబు సంగీతం సమకూర్చింది. "మనసు పావనగంగ మనసు గోదావరి - మలిన మంటని మనసు మధుర కవితాఝురి" అనే పాట పల్లవి ఒక మారు డ్యూటీరూమ్‌లో వుండగా స్ఫురించింది. శ్రీమతి వినయమణికి పాటగా రాసిచ్చాను అప్పటికప్పుడే. ఆ తరువాత ఆ పల్లవి ఎందుకో బాగా నచ్చి ఇలా రెండుమార్లు పాటలుగా రాయడం జరిగింది. అందుకే ఈ పుస్తకానికి ఆ పేరే పెట్టడం జరిగింది. నా పాటలన్నీ ఒకచోట ఇలా సంపుటీకరించాలన్న

అభిలాష నా జీవనసహచరీ, ఆకాశవాణిలో నా సహోద్యోగినియై హైదరాబాద్ కేంద్రంలో ప్రస్తుతం కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేస్తున్న ఉషారాణిదే! పాటలంటే మా అబ్బాయి చిరంజీవి స్నేహిత్‌కు ఉన్న ఇష్టం ఈ అభిలాషకు మరో తోడు. నా బతుకు పాటకు పల్లవి ఉషకు ఇది జన్మదిన కానుక.

ఈ పాటలు అప్పటికప్పుడు అవసరార్థం రాసినవి కావడం వల్లనూ, శుద్ధప్రతులంటూ వేరే రాసిపెట్టుకునే అలవాటు నాకు లేకపోవడం వల్లనూ, నేను రాసిన కొన్ని పాటలు దొరకలేదు. లభించిన మేరకు ఇలా సంపుటీకరిస్తున్నాను. ఆకాశవాణిలో వచ్చిన మూడు నాలుగు పాటలు స్క్రిప్ట్‌గానీ, పాట రికార్డింగ్స్ కానీ లభించలేదు. అలాగే దూరదర్శన్‌లో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ శ్రీమతి జె. శకుంతల రాయించిన పాటలూ ఒకటి రెండు ఉండాలి. అవీ అలభ్యం. పాటలకు సంబంధించిన వివరాలు కూడా లభ్యమైనంత మేరకే ఇచ్చాను. కొన్నింటి ప్రసారతేదీలు కూడా గుర్తులేవు. ఈ పాటల్లోని కొన్నింటి రికార్డింగ్స్ ఆకాశవాణిలోనూ ఇప్పుడు వున్నట్లు లేవు.

నేనూ ఆకాశవాణిలో పనిచేసినన్నాళ్లూ ఉద్యోగం తృప్తిగా చేశాను. వృత్తిలో భాగం కాకపోయినా పాటలు రాసాను. బిహైగ్రేడ్ డ్రామా వాయిస్‌గా నాటకాల్లో వేసాను. ఏడేళ్లు అనౌన్సర్ శ్రీమతి జ్యోత్స్నతో 'పరిచయపత్రం' శ్రోతల ఉత్తరాలకు జవాబులు ఇచ్చాను. ఆకాశవాణి కవిసమ్మేళనాలు కొన్ని ఆహుతుల సమక్షంలో నిర్వహించి వ్యాఖ్యాతగా వ్యవహరించాను. స్వయంగా కవిగా కొన్ని కవిసమ్మేళనాల్లో పాల్గొన్నాను. ఉషశ్రీ గారి తర్వాత విజయవాడలో తెలుగు విభాగం కార్యక్రమ నిర్వహణాధికారిగా చేశాను. 1983లో ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనంలో తెలుగుకవిగా పాల్గొనడం, ఆ కవిత అన్ని భారతీయ భాషల్లోకి అనువదింపబడడం జరిగింది. ఆ తరువాత తెలుగు విభాగం అధిపతిగా పలు సంవత్సరాలు జాతీయ కవిసమ్మేళనం తెలుగు అనువాద కార్యక్రమం నిర్వహించడం ఓ తృప్తి.

జూన్ ఒకటి, 1978లో ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగంలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగంలో చేరాను. 1982లో హైదరాబాద్ ప్రధాన కేంద్రానికి బదిలీ అయ్యాను. ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా పదోన్నతిపై 1991లో విజయవాడ కేంద్రంలో చేరి తెలుగు విభాగాధిపతిగా పనిచేసి 1995లో తిరిగి ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రానికి వచ్చాను. తెలుగు విభాగమే కాక కొన్ని సంవత్సరాలు పెక్స్‌కో (ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ కో ఆర్డినేటర్) గానూ చేశాను. 2005లో ఆకాశవాణి వరంగల్‌లో కొద్దికాలం పనిచేసి 2006లో తిరిగి హైదరాబాద్ వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగానికి వచ్చి కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉండగానే మూడు దశాబ్దాల వృత్తి జీవితం తర్వాత 2008 ఆగస్టు 1న స్వచ్ఛంద పదవీవిరమణ చేసాను. రిటైరవడానికి 2011 నవంబర్ వరకూ అవకాశం వున్నా, ఉద్యోగంలో తృప్తి నిలుపుకోవాలని, మారుతున్న పరిస్థితుల్లోని పనిచేసే సంస్కృతి క్షీణత్వం గిట్టక ఆ పనిచేశాను. సుఖంగా, శాంతిగా, సంతృప్తిగా వున్నాను.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం పిల్లల కార్యక్రమానికి 'ఒకనాటి కల', 'వంటింట్లో విప్లవం' అనే సంగీత రూపకాలు నా చేత రాయించి శ్రీమతి జానకీరాణిగారు చిత్తరంజన్, పాలగుమ్మి విశ్వనాథం గార్ల చేత కంపోజ్ చేయించి ప్రసారం చెయ్యడం మాత్రమే కాదు, విదేశీ ప్రసారాలకు అనువదింపచేసి అవార్డు ఎంట్రీలుగా పంపారు. ఆ సంగీత రూపకాలను ఈ సంకలనంలో చేర్చడం సాధ్యం కాలేదు.

ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో మల్లిక్‌గారు నా పాట లలితసంగీత పాఠంగా నేర్పి, తాను స్వయంగా ఆ వయసులో పాడడం మరిచిపోలేను! ఆయన ఇప్పుడు ఈ లోకంలోనే లేరు. 'కాలరేఖ'లో కలిసిపోయారు. అలాగే నా పాటలకు సంగీతస్వరాలు కూర్చిన ఘంటసాల రత్నకుమార్, కృష్ణరంగం, శోభారాణి, ఈ మాసపుపాట నొకదానిని అద్భుతంగా గానం చేసిన శ్రీమతి శారద దివంగతులైనా అనుభూతిరమ్య జ్ఞాపకాలుగా వారి పాటలు పరిమళాలు మిగిల్చివెళ్ళారు.

నా పాటల రచనకు ప్రోత్సాహపు బాటలు వేసి పలుపాటలు రాయించి సంగీతం కూర్చిన డాక్టర్ ఎం. చిత్తరంజన్‌గారు 'హాసం' పత్రికలో లలిత సంగీతం శీర్షిక నిర్వహించి నా పాట గురించీ, నా గురించీ రాసి తమ గ్రంథంలో కూడా దానిని చేర్చారు. ఎంతో ఆత్మీయంగా ఈ పుస్తకానికి ముందు మాట రాసిన చిత్తరంజన్‌గారికి నా కృతజ్ఞతాభివందనాలు. నా పాటల సంగీత దర్శకులకూ, గాయనీగాయకులకూ, ఆకాశవాణి సంస్థకూ నా ధన్యవాదాలు. 'పిల్లల పాటలు' సి.డి.ని ప్రసారభారతి ఆర్కైవ్స్ తరుఫున విడుదల చేస్తూ నేను రాసిన 'బాలలం మేం ఒక్కటే' గీతానికి అందులో చోటిచ్చిన ప్రసారభారతి మార్కెటింగ్ డివిజన్, ఆకాశవాణి హైదరాబాద్ వివిధభారతికేంద్రం డైరెక్టర్ శ్రీమతి శైలజా సుమన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

శ్రీమతి తురగా జానకీరాణి, శ్రీ చిత్తరంజన్ గారలు కలిగించిన పాటల రచనాస్ఫూర్తికి వినమ్రుడిని. కలగ కృష్ణ మోహన్, కె. రామాచారి, బంటి నేటి నవతరానికి అందిస్తున్న పాటల పరీమళాలకు ప్రత్యేక అభినందనలు.

నా మీద ప్రేమతో, అభిమానంతో ఈ పాటల పుస్తకానికి ముఖచిత్రం సంతరించి, ఉష బొమ్మకూడా గీసి ఇచ్చిన ప్రముఖ చిత్రకారుడు, ఆత్మీయ మిత్రుడు 'చంద్ర'కు మనసా ధన్యవాదాలు. అందంగా డి.టి.పి. వర్క్ చేసిన శ్రీమతి నిర్మలగారికీ, అందంగా ముద్రించిన ఓం సాయి గ్రాఫిక్స్ వారికీ కృతజ్ఞతలు.

'మనసు పావన గంగ' అనే నా ఈ పాటల సంకలనం మీకు నచ్చుతుందని ఆశ.

సదా మీ
**సుధామ**
2.7.2010

జి.12, సాదత్ టవర్స్,
పద్మావతీ అపార్ట్‌మెంట్స్,
సలీంనగర్ కాలనీ, మలక్‌పేట,
హైదరాబాద్ 500 036.
ఫోన్ ఇల్లు: 040-24545780
ఫోన్ సెల్లు: 9849297958

# పాట బాట ...

1. మనసు పావన గంగ........................................ 23
2. ఎందుకిలా నా మదిలో........................................ 25
3. స్వాతంత్ర్యం నా పేరు........................................ 27
4. తిమిరఛిన్నకర సమరశాఖలై........................................ 29
5. బాలలం మేం ఒక్కటే........................................ 31
6. వనకోయిల కబురు........................................ 33
7. వలపు అనే మాటతోనె........................................ 35
8. ముసిముసిగా నవ్వుతుంటె........................................ 37
9. గురువే బ్రహ్మ........................................ 39
10. మతం మనకు వద్దు........................................ 41
11. వందనమిదె మాతా........................................ 43
12. జాగృతమై చరించండి........................................ 44
13. మహిళా జాగృత గీతం........................................ 46
14. విరితోటల ఆవిరులను........................................ 48
15. బాధ్యత తెలిసిన బాలలము........................................ 50

16. తాతంటే తాత కాదు ........................ 51
17. రాగం తీస్తే ........................ 52
18. మాతృవందనం ........................ 53
19. కృష్ణా! గోపీకృష్ణా! ........................ 55
20. ఆడుతోంది దీపం ........................ 56
21. ఎదురై నువ్వు పలకరిస్తే ........................ 58
22. భ్రమరానికి ప్రతిపువ్వా ........................ 60
23. పశుపక్ష్యాదుల ప్రేమిద్దాం ........................ 62
24. వలపు పాట ........................ 64
25. బంజరులే బంగరు పండును ........................ 65
26. విద్యా వినయం ........................ 66
27. పాడుకోడానికీ పాటకావాలి ........................ 68
28. బాల ప్రపంచం మాది ........................ 69
29. మనసు పావనగంగా (2) ........................ 71
30. సమైక్య గీతం ........................ 73
31. తిమిరాలను ఛేదించే సమరాలే దీపాలు ........................ 74
32. తడబడకు ........................ 76
33. ఎగరాలి ఎగరాలి ........................ 77
34. మధురగీతి ........................ 79
35. పొగగొట్టం ........................ 81
36. శ్రమయే ధనము ........................ 82
37. కంటిచూపులం ........................ 83
38. తలపు తలుపు తట్టినంత ........................ 85
39. ఏకాంతం తీగె మీద ........................ 87
40. కాలరేఖ ........................ 89

# మనసు పావనగంగ

మనసు పావనగంగ
మనసు గోదావరి
మలినమంటని మనసె
మధుర కవితాఝురి ॥మనసు॥

వయసు తీరుకు
మనసు వల కాకపోతే
వగపు సెగతో
బతుకు శిలకాకపోతే

కంచెయే చేనును
కాటేసి దాటేసి
వంచించి ముంచేటి
కథను పెంచకపోతే ॥మనసు॥

అమలిన స్నేహమే
నిను నన్ను కలిపితే
అనురాగ భావాలు
మించి ప్రేమించితే

విమల విశ్వాసమే
ఆశయై శ్వాసయై
ఏకమై మన మనికి
మధుర సుధలొలికితే ॥మనసు॥

*

(ఆకాశవాణి విజయవాడ, గానం: తిరుపతి త్యాగరాజు, సురేఖామూర్తి, సంగీతం: మల్లాది సూరిబాబు, 1992)

# ఎందుకిలా నా మదిలో

ఎందుకిలా నా మదిలో
కడలిలాగ పొంగావు
నెలరాజువు నీవై నా
ఎదను వలపు కురిశావు

కలతపడిన నా నిదురకు
ఉషస్సేలా అయ్యావు
నీ కలవరమే ఇలవరమై
నా చెంతకు చేరావు ॥ఎందుకిలా॥

మూగవడిన గొంతులోన
రాగమెలా అయ్యావు
నీ అనురాగమె రాగంగా
పాటగ నను మార్చావు ॥ఎందుకిలా॥

కుంచించిన బ్రతుకు
వర్ణచిత్రమెలా చేశావు
సుఖశాంతుల రంగులద్ది
కుంచె నీవె అయినావు ॥ఎందుకిలా॥

వర్ణచిత్రశోభితమై
బ్రతుకునావ నెక్కుదాం
వలపు కడలి అలల తేలి
తీరాలను చేరుదాం ॥ఎందుకిలా॥

*

(దూరదర్శన్‌లో ప్రసారితం. 1.9.1986, రాత్రి 8.45 ని.
సంగీతం: శ్రీ నల్లూరి సుధీర్ కుమార్.
గానం: శ్రీ సుధీర్‌కుమార్, మంజులా ఉదయ్ కుమార్)

# స్వాతంత్ర్యం నా పేరు

స్వాతంత్ర్యం నా పేరు
భారతం నా ఊరు
ప్రతి నిత్యం మహోదయం
నా హృదయం కోరు ॥స్వాతంత్ర్యం॥

పరదాస్యపు శృంఖలాలు
పరితాపపు పంజరాలు
త్రెంచి విడిచి మునుముందుకు నడిచాను

ప్రజాస్వామ్య సూత్రాలు
ప్రజాక్షేమ చట్టాలు
ఏర్చికూర్చి మేలు కలుగు ప్రణాళికలు వేశాను

మత భేదం నాకుపడదు
కులతత్వం అసలు వలదు
అస్పృశ్యులు లేరు నాకు
అందరికీ వొకే ఆకు ॥స్వాతంత్ర్యం॥

పర్వతాలు నా అన్నలు
నదులేమో చెల్లెళ్ళు
మహాత్ములే జాతిపితలు
ప్రజలే నా కనుపాపలు

మేధావులు అధినాధులు
నను రక్షించే యోధులు
నా క్షేమం కాంక్షించే
నేతలె నా స్నేహితులు

నా కోసమే మీరంతా
మీ కోసమే నేనుంటా
మనం మనం స్వేచ్ఛ జనం
జనగణ గీతాలాపం ॥స్వాతంత్ర్యం॥

*

(సంగీతం: శ్రీ పి.వి. సాయిబాబా
ఆకాశవాణి హైదరాబాద్: ఈ మాసపు పాటగా,
మే 1981, రాత్రి 8.00 గం.లకు)

# తిమిర ఛిన్నకర సమర శాఖలై

తిమిర ఛిన్నకర సమర శాఖలై
అరుణ తరుణ రవి కిరణ రేఖలై
క్రాంతి నగారా మ్రోగించి
కాంతి కవాటం తెరవండోయ్
జాతి ప్రభాతం తెలుపండోయ్ ॥తిమిర॥

నైరాశ్యపు మబ్బులతో
నిర్లిప్తత వర్షించక
పేదరికం ముల్లులతో
పేగుతెంపి రోదించక

ఆశల ఆకాశంలో
ఆశయాల సూర్యుడిగా
జీవన సమరంలో
అనుక్షణం వీరుడిగా ॥తిమిర॥

చీమూ నెత్తురు కండాగుండె
అందరిలో ఒకటే కాదా
భాషా భావం సౌఖ్యం బ్రతుకు
అందిరలో ఒకటైపోదా

దేశం కోసం స్వార్థం విడిచి
సమస్త జాతికి నమోస్తు పలికి
విశ్వశాంతికై వియత్తలాలకు
ప్రగతిపథంలో ప్రయాణించగా ॥తిమిర॥

*

(ఆకాశవాణి హైదరాబాద్ 15.6.81 ఉదయం 7.15 ని.
బృందగానం. సంగీతం: శ్రీ పి.వి. సాయిబాబా)

# బాలలం మేం ఒక్కటే

ఎల్లలెరుగని వాళ్ళము
కల్లలెరుగని వాళ్ళము
బాలలం మేమొక్కటే
లోకమూ మాకొక్కటే

గోధుమరంగున కొందరు
పసుపువన్నె యింకొందరు
తెలుపు, నలుపు, యాపిల్ ఎరుపు
ఏ రంగైనా ముచ్చట గొలుపు

రంగేదైనా రూపేదైనా
నివసించే ఆ చోటేదైనా
బాలలం మేమొక్కటే
లోకమూ మాకొక్కటే

అన్నం పప్పు చారు కుర్మా
శాకాహారం తినువారయితే
గుడ్డూచేపా కోడీ కూరా
మాంసాహారం తినువారంతే

తిండేదైనా తీరేదైనా
తినగోరే ఆ రుచులేవైనా
బాలలం మేమొక్కటే
లోకమూ మాకొక్కటే

'అవునందురు' 'ఎస్' అందురు కొందరు
'ఓకే' 'దాదా' అందురు కొందురు
సీ 'దేఖో' 'జా' అంటూ కొందరు
పలువిధాలుగా పలుకుచుందురు

మాటేదైనా పాటేదైనా
పదాలు పలికే భాషేదైనా
బాలలం మేమొక్కటే
లోకమూ మాకొక్కటే

దేశాల్ వేర్వేరయినా గానీ
సందేశం మాదిదేయిదే
సంతోషంతో సకల ప్రపంచం
పకపకలాడాలన్నదే

ఎల్లలెరుగని వాళ్ళము
కల్లలెరుగని వాళ్ళము
బాలలం మేమొక్కటే
లోకమూ మాకొక్కటే

*

(సంగీతం: శ్రీ చిత్తరంజన్. యునిసెఫ్ సందేశం ఆధారంగా
1979 అంతర్జాతీయ బాలల సంవత్సర గీతం
ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రసారం 14.11.1979
ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కార్యక్రమంలో 'ఈ పాట
నేర్చుకొందాం'గా 1979 జూలై నెలలో 2.30 గం॥లకు.
ఈ పాట 'పెద్ద బాలశిక్ష'లో కూడా ప్రస్తుతం చోటుచేసుకుంది)

# వన కోయిల కబురు

ఆమని పాటలుపాడే
ఈ వనకోయిల కబురేమిటి
చిలుకల కులుకులు తెలిపే
సందేశం సొబగేమిటి ॥ఆమని॥

మధురగాత్ర సౌలభ్యం
మావి చివురులిచ్చాయని
జామిపండురుచులే
ఆటవయారాలు నేర్పాయని ॥ఆమని॥

కండబలం గుండెబలం
ఇచ్చేదే తిండిపుష్టి
బలవర్ధక ఆహారపు
ఖజానాయె ఈ సృష్టి ॥ఆమని॥

కాయగూరలూ పండ్లూ
అందించే తరుసంతతి
తరాల వరాల తీరున
జగతిలోన కనిపించును ॥ఆమని॥

ఆనందం ఆరోగ్యం
ఆటల పాటలచందం
జీవకోటికంతటికీ
అనునిత్యం అందించును ॥ఆమని॥

బ్రతుకంతా వసంతమై
జీవించగ ప్రజలారా
బలవర్ధక ఆహారం
తీసుకోండి ప్రతిరోజూ

మీ తనువూ మీ మనసూ
ముందుండే కాలమంతా
సురుచిర సుందరమై
భాసించును జగమంతా ॥ఆమని॥

*

(ఆకాశవాణి ఈ మాసపు పాట: ఏప్రిల్ 1986.
గానం: శ్రీమతి ఆర్. ఛాయాదేవి,
సంగీతం: శ్రీ సురేంద్ర నాథ్ కాలే)

# వలపు అనే మాటతోనె

ఆమె: వలపు అనే మాటతోనె
వలపన్నినదెవరో
వలవేసీ నను పట్టీ
వలపించినదెవ్వరో

అతడు: అలా తలా వలా నాకు
అన్నీ నువ్వే నవలా
నన్ను కౌగిలించినావు
నవయవ్వన శోభలా

ఆమె: వలరాజే విలుకాడై
వేటాడెను లేడిని
చూపులతో పుట్టించెను
చలి లోపల వేడిని

అతడు: కాల్చివేయు తపనల
చల్లార్చు సుధాభాండము
నీ చేవలతో చిగురించును
మోడైనా కాండము

ఆమె: జీవనశాఖలపై తీపిరుచుల
పండ్లు మెండు
వాటికొరకు వ్రాలిన
ప్రేమపక్షులీ రెండు

అతడు: వలపు వలల తగులుకొనుట
అడ్డేమీ కాదు మనకు
సుఖశాంతుల గగనంలో
వలతోటే ఎగురువరకు

*

(దూరదర్శన్ 4.2.1987 సాయంకాలం 6.30కు. శ్రీ నల్లూరి సుధీర్ కుమార్ సంగీతం సమకూర్చి శ్రీమతి మంజులా ఉదయ కుమార్‌తో గానం చేసింది.)

# ముసి ముసిగా నవ్వుతుంటె

అతడు: ముసి ముసిగా నవ్వుతుంటె
చెబుతా ఒక మాట

ఆమె: మాటకారి మనిషివని
నాకు మునుపె తెలుసు కదా

అతడు: చలితోటి యుద్ధానికి
చెలివుంటే చాలదా

ఆమె: యుద్ధాలే వద్దంటే
ఈ బుద్ధులు ఎందుకటా

అతడు: నా ప్రక్కన నువ్వుంటే
మనసంతా శాంతి కదా

ఆమె: శాంతిపేర పావురమై
దూరాలకు ఎగురుటకా ॥ముసిముసి॥

అతడు: ఎగసిపడే హృదయమే
ఆనందపు గుర్తు సుమా

ఆమె: ఆనందమె అందానికి
గిరిగీసిన పరిధిసుమా

అతడు: చెలి ఆనందపు అందాలకు
బందీ ఇతగాడు కదా

ఆమె: గుబాళించు గులాబీయె
ఎదలో జతగాడు సదా ॥ముసిముసి॥

*

(దూరదర్శన్ హైదరాబాద్,
సంగీతం: శ్రీ సుధీర్ కుమార్ నల్లూరి)

# గురువే బ్రహ్మ

గురువే బ్రహ్మ గురువే విష్ణువు
గురువే ఈశ్వరుడు
ఈ సూత్రం నమ్మిన ఆదర్శనీయుడు
రాధాకృష్ణుడు పండిత రాధాకృష్ణుడు ॥గురువే॥

సర్వేపల్లి వంశజుడు
తర్కశాస్త్ర పారంగతుడు
భారతదేశపు ఘన సంస్కృతికి
కీర్తి ప్రతిష్ఠితుడు

దక్షుడు మరి అధ్యక్షుడు
తానుత్తమ అధ్యాపకుడు
గురువులకే గురువాతడు
వందిత గురుకుల భూషణుడు ॥గురువే॥

మట్టి ముద్దనూ మణిరత్నాన్ని
తాకే కిరణం ఒకటే
జ్ఞాన సూర్యుడౌ ఉపాధ్యాయుడు
చెప్పే పాఠం ఒకటే

మెరిసే మెరుపు వెలిగే వెలుగు
శిష్యుల అర్హత బట్టే
గురువుకు దోషం అంటదు ఎన్నడు
మట్టి బుర్రలను బట్టే ॥గురువే॥

ఉపాధ్యాయుల ఉత్సవదినము
అయిదవ సెప్టెంబర్
జ్ఞానసంపదకు పూజ చేకొనగ
పుట్టినారు వారు

గురువుల కొలిచే శిష్యులెప్పుడూ
బ్రతుకున చెడిపోరు
మనసున మమతలు పండేటప్పుడు
ఎవ్వరు విడిపోరు ॥గురువే॥

*

(ఆకాశవాణి పాఠశాల విద్యార్థుల కార్యక్రమంలో
ఈ పాట నేర్చుకుందాం. సెప్టెంబర్ 1989 మ॥ 2.30 ని॥
సంగీతం: శ్రీమతి శోభారాణి)

# మతం మనకు వద్దు

హితసేతువు సుఖహేతువు
కాని మతం మనకొద్దు
మానవతను అర్చించే
మనసు అభిమతాలె ముద్దు

మానవసేవా ఫలితం
మాధవసేవే సతతం
కల్మషమెరుగని హృదయం
ఈశ్వర్ అల్లా నిలయం ॥హిత॥

మతమంటే ఏమిటి
ఒక మార్గం కాదా
ప్రార్థన ఏదయినా
పరమార్థం రాదా

పరస్పరం కలహిస్తే
మతం మెచ్చుతుందా
సమత మమత బోధించని
మతగ్రంథం వుందా ॥హిత॥

జీవనసుఖశాంతుల
ఆరాటమే దైవం
ఆ శక్తిని అర్చించే
ఆర్తిపరుడు జీవం

మాననీయ మహనీయుడు
మానవుడే ఏనాడూ
మానవతను మించినట్టి
దైవం లేదంటాడూ ॥హిత॥

*

(సంగీతం: ప్రీతమ్. ప్రభాతగీతం)

# వందన మిదె మాతా

వందన మిదె మాతా
కొనుమా అందరిజోతా
జనగణ మంగళదాయక
జనతంత్ర ప్రదాతా

భిన్నత్వంబున మ్రోగే
నీ కంకణనిక్వాణం
తల్లీభారతి మాకేకత్రిత
భావిత చరణం

సురు చిరరూపం
మహిత సంధానం
సుమధురధ్వానం
నీ మంగళగానం ॥వందన॥

సప్తవర్ణ సంచాలిత గాత్ర
సమాహారమగు శ్వేతం
ధాత్రీ నీ కాంతిపుంజమే
ప్రగతి సమోపేతం

సౌహార్ద్రం సమభావం
స్వాతంత్ర్యం సౌభ్రాతం
పునాదులై పునీతమైనది
ఈ భారత జాతి భవనం ॥వందన॥

*

(దేశ భక్తిగీతం, సంగీతం: శ్రీ నల్లూరి సుధీర్ కుమార్, ఉ॥ 6.00 ని.)

# జాగృతమై చరించండి

జాగృతమై చరించండి
భరతజాతి ప్రజలారా
విశ్వశాంతి సందేశం
చాటించుడు జనులారా

నీవూ నేనూ వేరను
భావాలకు చోటివ్వక
వేరుబాటు విధానాలు
కలనైనా కోరుకోక

కులం మతం భాషా యాస
ఏదైనా ఎవరైనా
అంతా ఒకటను వేదం
నరనరాల నినదించగా ॥జాగృతమై॥

మాటలకూ మంటలకూ
సంబంధం కలపద్దు
కృపాకీలలే తప్ప
తుపాకీల పనులొద్దు

హింసా మోసం ద్వేషం
ఛాయకైనా పోవద్దు
నలుగురిలో నగుబాటై
తలవంచుకు తిరగొద్దు ॥జాగృతమై॥

నీరయినా నింగయినా
నడయాడే నేలయినా
ప్రాణభీతి వాయువుతో
పంకిలమై పోరాదు

విస్తరించి సుఖం శాంతి
మానవతా స్వేచ్ఛా కాంతి
ప్రతి మనిషీ మనీషిగా
మనుగడ సాగించాలి

జాగృతమై చరించండి
భరతజాతి ప్రజలారా
విశ్వశాంతి సందేశం
చాటించుడు జనులారా

*

(ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం. ప్రభాత గీతం: 11.10.86
ఉదయం 6.00 గం.టకు, సంగీతం: శ్రీ ఉషాకాంత్)

# మహిళా జాగృత గీతం

నయవంచన కావించే
నయగారం తీరు
ఆధిక్యం చూపిస్తూ
అణచి వేయువారు

వద్దు మాకు కిరీటాలు
వద్దు రాణివాసాలు
వంటిల్లే గుడి చేస్తూ
మాకు వద్దు ఏ పూజలు

పుణ్యం కొద్దీ పురుషుడు అంటూ
కట్నం మూటలు అడిగారు
దానం కొద్దీ బిడ్డలు అంటూ
పబ్బం గడుపుకు పోతారు

శయన రంభయని సహనమూర్తి అని
యాతనలెన్నో పెడతారు
ఇంటికి దీపం ఇల్లాలంటూ
అగ్నికి ఆహుతి చేస్తారు ॥నయ॥

మగవారల దిగ్విజయం వెనుక
ఉన్నదిలే మగువంటారు
అపజయాలనే అతివలకిచ్చి
నిచ్చెనగా దాటేస్తారు

మనువుల కాలం విలువలేలనే
మనిషిగ చూస్తే చాలు
సమతా మమతా సమధర్మంతో
జీవనస్నేహం సాగు

చిక్కులుపోవాలంటే
హక్కులకై పోరాడాలి
మహిళాజనగణమంతా కూడి
జాగృతగీతం పాడాలి ॥నయ॥

*

(సంగీతం: ప్రేమ్‌జీ. బృందగానం. ఆకాశవాణి విజయవాడ, వనితావాణి 27.3.1994)

# విరితోటల ఆవిరులను

విరితోటల ఆవిరులను
పురికొల్పిన భ్రమరమా
విరికన్నెల దరిచేరగ
మరలే సంభ్రమమా

గుబాళించు గులాబీల
ముల్లు ఎరుగవూ
మొగలిపొదల దర్పంలో
సర్పమెరుగవు

పసిడికోరి పై మెరుగుకె
పడిపోతావెందుకో
గడ్డిపూవు గుండెలోతు
ప్రేమ అందుకో ॥విరి॥

అందాలూ చందాలూ
సిరులూ సంపదలూ
మిడిమేలపు అద్భుతాలు
కావు శాశ్వతాలు

తృణపుష్పం తీరయినా
తను గుణవతి కాగా
ఆమెతోనె నీ బ్రతుకున
ఆమని రాదా ॥విరి॥

*

(ఆకాశవాణి విజయవాడ పక్షగీతిక.
సంగీతం: శ్రీ రత్నకుమార్, ఉదయకుమార్. గానం: శ్రీ కె. రామాచారి)

# బాధ్యత తెలిసిన బాలలము

బాధ్యత తెలిసిన బాలలము
భావి ప్రపంచ పౌరులము
రేపటి కోసం నేడు శ్రమించే
మానవవనరుల వీరులము
రేపటి కోసం నేడే విరిసిన
మానవత్వపు వెలుగులము ॥బాధ్యత॥

సుజలం సుఫలం సస్యశ్యామలం
సమస్త భూమి కావాలంటూ
చెట్టూ చేమా పక్షీ పశువుల
పరిరక్షించే హరితయోధులం ॥బాధ్యత॥

ఆకలినిద్రా తీరేటందుకు
విద్యా వైద్యం పొందేటందుకు
అన్ని వేళలా పిల్లల హక్కులు
ఆడుతు పాడుతు సాధిస్తాం ॥బాధ్యత॥

కమ్మని కలలకు శ్రీకారం
ప్రగతివేదికకు ఆకారం
మేము కూర్చినా మానవ హారం
స్వర్ణభారతికి సుమహారం ॥బాధ్యత॥

*

(సంగీతం: శ్రీ కె. రామాచారి, గానం: లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ పిల్లలు. 12.12.2004 ఆకాశవాణి బాలల అంతర్జాతీయ ప్రసార దినోత్సవం నాడు ఉ॥ 8.35కు ప్రసారం)

# తాతంటే తాత కాదు

తాతంటే తాత కాదు
దేశానికి త్రాత
మహాత్ముడే మనపాలిటి
స్వేచ్ఛా ప్రదాత

మాటే ఒక మంత్రంగా
ప్రజను కూడగట్టి
ఉప్పుకూడ నిప్పులాగ
ఆంగ్లేయుల భయపెట్టి

సత్యాగ్రహ నిరసనలే
ఆయుధంగ చేపట్టీ
శత్రువులను పారిపోగ
తరిమికొట్టినట్టి నేత ॥తాతంటే॥

కులం మతం కుళ్లుతనం
మనసులోంచి దులిపి
సమత మమత సమభావం
హృదయంలో నిలిపి

ప్రపంచాన గాంధేయం
శాంతి చిహ్నమని తెలిపి
భక్తితోడ అందిద్దాం
మనసారా జోత ॥తాతంటే॥

*

(21.5.1996. పాఠశాల విద్యార్థుల కార్యక్రమంలో
'ఈ పాట నేర్చుకుందాం'గా ప్రసారం. సంగీతం: శ్రీమతి శోభారాణి)

# రాగం తీస్తే -

రాగం తీస్తే సంగతివేస్తే
గాత్రం ప్రవహిస్తుంది
మౌనం కరిగి మాటపాటగా
మనసు పరవశిస్తుంది.

కోరిక చివురులు తొడిగినప్పుడు
కాంక్ష ప్రతిఫలిస్తుంది
నీవూ నేనను భావం తొలగి
మనమే పెనవేస్తుంది

మురిసి విరిసిన మధురక్షణాన
ఏకవచనమెదురవుతుంది
శ్రుతి చేసిన ఒక సితార తీరున
సిగ్గు సరిగ మొగ్గేస్తుంది

యుగళ గీతమేదైనా గాని
బృందగాన మనిపిస్తుంది
వ్యక్తి శక్తియై చరణం సాగిన
చరిత్ర అనిపిస్తుంది

మనుషులందరూ పల్లవించితే
జనగణమే పదమౌతుంది
పులకరించిన దేశపు దేహం
ప్రగతిగొంతు సవరిస్తుంది

*

(రచన: 7.3.1996) (ఈ మాసపు పాట ఆదివారం ఉ॥ 7.35కు, ఆకాశవాణి హైదరాబాద్ జూన్ 1996. గానం: శ్రీమతి ఛాయాదేవి, సంగీతం: శ్రీ నల్లూరి సుధీర్ కుమార్)

# మాతృ వందనం

శాంతికిరణ మాలికలను
అల్లుకునే ఆవరణలో
రణవర్ణపు తోరణాలు
కట్టకూడదు, కట్టకూడదు ॥శాంతి॥

అంతా ఒకటిగ బ్రతికే
ఆనంద నిలయంలో
చీకటి రగిలే చిచ్చును పెట్టకూడదు
చిచ్చును పెట్టకూడదు ॥శాంతి॥

కుల సంకుల సమరాలు
కుటిల రాజకీయాలు
విడనాడిన నాడే
ప్రగతీ ప్రగతీ

అని చాటెను మన భారతి
సర్వ వర్ణ సమానతే
ఆ తల్లికి మన హారతి ॥శాంతి॥

ఆవేశం కాదు
మనకు ఆలోచన కావాలి
హింసా మోసం కాదు
ఇలను శాంతి సుమం విరియాలి

గణనీయపు గణ తంత్రం
మనదీ మనదీ
ప్రజాస్వామ్య ఆభరణం

గగనమంత ఎత్తుకెగురు
భరత కేతనం
త్రివర్ణ భరతకేతనం
త్రివర్ణ భరతకేతనం

*

(ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం: మాతృవందనం 26.1.1989,
సంగీతం: శ్రీ చిత్తరంజన్)

# కృష్ణా! గోపీకృష్ణా

కృష్ణా గోపీకృష్ణా రాధికా తృష్ణా
పిలుపురా  చెలి తొలి వలపురా
విరహ యమునలూ, మధుర మధురలూ
రాధ కోరికై నిలిచెనురా

పొదపొదలో పల్లవాధరలు
ముక్తికాంత రూపాంతరలూ
కృష్ణభక్తితో పొంగి పొరలు
పాలసంద్రం దొంతరలు ॥కృష్ణా॥

ప్రణయభావ జవరాలి సరళి
రాగరవళి అదిమురళిరా
రాధామాధవ విహారయాత్రలు
అమృతజీవన పాత్రలురా

కలయిక మధురం
మనుగడ మధురం నిరంతరం
ప్రణయరక్తి పరిపక్వత పొందు
మోక్షపదవి అనంతరం.

*

(సంగీతం: శ్రీ నల్లూరి సుధీర్ కుమార్. గాయని: శ్రీమతి జ్యోతిరామకృ
– దూరదర్శన్‌లో ప్రసారితం)

# ఆడుతోంది దీపం

ఆడుతోంది దీపం
పాడుతోంది దీపం
తిమిరహరణ చరణంతో
జ్ఞాన కాల స్ఫురణంతో ॥ఆడు॥

చిక్కుల చికాకుల
చీకటింటి మూలల్లో
వేదన రోదన ముసిరిన
దళితజీవి వాడల్లో

అవినీతి బంధుప్రీతి
అలుముకున్న మేడల్లో
చైతన్యం చెంగలించి
మార్పు తీర్పు సంతరించి

వెలుగుపూల కళికలుగా
రూపెత్తిన కాళికగా ॥ఆడు॥

హింసా ద్వేషం మోసం
భావాలను రోసిల్లి
గుండె గుండెలో
మమతల స్నేహాలను పోసి

ప్రేమా కరుణా
ఎదలో వత్తులుగా వేసి
వెలిగించిన జ్ఞాన ప్రమిద
మహనీయుల త్యాగ సమిధ

సమ సమాజ నిర్మాణం
సమకట్టిన అగ్నిసుధ ॥ఆడు॥

*

(ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం. ప్రభాతగీతం. 23.10.1995
ఉదయం 6.30 గం.లకు, సంగీతం: శ్రీ ప్రఖ్యా ఆంజనేయ శాస్త్రి)

# ఎదురై నువ్వు పలకరిస్తే ....

ఆమె: ఎదురై నువ్వు పలకరిస్తె
ఏదో ఏదో పులకింత
అతడు: పులకించిన ఎదలోపల
ఆ క్షణమే గిలిగింత

ఆమె: ఎమిటిది ఏమిటిది
ఏమిటి ఈ వింత
అతడు: ప్రేమలోన పడినందుకె
చేరినాము ఈ చెంత

అతడు: పిలిచి నిను కలిసి
కబురులెన్నొ కలబోసి
ఆమె: తలచి నినువలచి
తీపి తలపులెన్నొ మోసి

అతడు: చెప్పలేని గుండె బరువు
కేదో లోనయ్యా
ఆమె: నీవు నేను ఒకటయ్యే
కోరికరా కృష్ణయ్యా

అతడు: నా జీవిత సగ భాగం
నువ్వే ఈ మాట నిజం
ఆమె: ఇంకెందుకు భయం
కలిసి నడువు భుజం భుజం

అతడు: కాదను వారెవరు లేరు
కలిసినాక మన ఆశలు
ఆమె: ఖాతరసలు చేయబోము
ఖాయమింక మనపెళ్ళి

*
(దూరదర్శన్‌లో ప్రసారం)

# భ్రమరానికి ప్రతి పువ్వూ..

భ్రమరానికి ప్రతి పువ్వూ
పిలుస్తోందనే భ్రమా
ప్రతి పూవుకు భ్రమరమంటె
ఏ మూలో ప్రేమా ॥భ్రమరానికి॥

వలపు పత్రమందగానె
వణుకుతుంది ప్రతి చెట్టూ
వసంతమొచ్చిందంటే
ప్రతివారల గుట్టురట్టు

ప్రేమనేరమేమి కాదు
పరితాపం ఎందుకు
ఎదలోపలి ఎదగా
ఎదిగేందుకు పదముందుకు ॥భ్రమరానికి॥

ఒక పురుషుడు ఒక ప్రకృతి
అదే జీవగతి
బృందగీతి మందమతి
శ్రుతి తప్పిన రీతి

సందేశంలేని పాట
సంధించదు ఏ కలమూ
బ్రతుకు తీపి పాటతోనె
కలిపేదే యుగళమూ ॥భ్రమరానికి॥

*

(శ్రీ కలగ కృష్ణమోహన్ సంగీత దర్శకత్వంలో గానం: రమణ.
ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం లలిత గీతం)

# పశు పక్ష్యాదుల ప్రేమిద్దాం

పశు పక్ష్యాదుల ప్రేమిద్దాం
జంతు సంతతిని రక్షిద్దాం
ప్రకృతిలో సమతుల్యం నింపగ
అందరు కలిసి కృషి చేద్దాం ॥పశు॥

పిల్లి, కుక్క పెంపుడువైతే
ఆవు, గేదె పాలు పెరుగులకు
బాతు, కోడి, మేక, గొర్రె,
ఎద్దు, ఎనుము, గాడిద, గుర్రం
మనిషి మనుగడకు అన్నీ తోడే

విశ్వాసం చూపును కొన్ని
బరువులు లాగును మరికొన్ని
పాడిపంటలు ఇచ్చును కొన్ని
కూరిమి గలవె జంతువులన్నీ ॥పశు॥

తమ జోలికి రాకుంటే సరిలే
జంతువు లేమీ హాని చేయవు
మన కోసం తమ శ్రమశక్తులను
త్యాగం చేసి ఉపకరించును

మనిషి మనుగడకు అన్నీ తోడే
విశ్వాసం చూపును కొన్ని
బరువులు లాగును మరికొన్ని
పాడిపంటలు ఇచ్చునుకొన్ని
కూరిమిగలవె జంతువులన్ని ॥పశు॥

*

(సంగీతం: రామాచారి)

# వలపు పాట

లతలాగా పెనవేసుకు
జతకూడగ రానా
మధుమాసం నేనై
సుధలను నింపేయనా

ప్రేమంటే మనదేలే
ప్రేమికులం మనమేలే
అనురాగం ఆనందం
అంటే మన మనసేలే

నీ ఆటా నా పాటా
కని మురిసెను ఈ తోటా
మన అందం మన తెలివీ
కలిసి సాగె ప్రేమబాట

ఏ బాధలు ఎదురైనా
ఎడబాటే లేదు మనకు
ఎదురు నిలిచి కష్టాలకు
సాధిస్తాం ఘనవిజయం

*

(గానం: శ్రీమతి వి. కనకదుర్గ, సంగీతం: వి.కె. ఇలియాస్.
13.11.1996, ఉదయం 7.45 ని.లకు లలిత సంగీతంలో ప్రసారం)

# బంజరులే బంగరుపండును

బంజరులే బంగరుపండును ఓరన్నా
మనమంతా కలిసిశ్రమిస్తే రైతన్నా
దేశానికి పట్టుకొమ్మ ఈ పల్లెసీమరా
జాతికంత వన్నెపెంచు పల్లెవెలుగురా

శివగంగను ఆనాడు భగీరథుడు దించాడు
ఆ దీక్షే కావాలి మనకంతా ఈనాడు
పలుగులనూ పారలనూ పోగేసుకు రావాలి
రైతు రైతు చేయి కలిపి కష్టమెంతొ చేయాలి

నీరుపారి భూములన్ని పంటలిచ్చురా
పైరు పెరిగి నేలతల్లి సంతసించురా
ఇంటింటా కరెంటు దీపం ఇక నుండీ వెలగాలి
బండి దారి ప్రయాణాలు బస్సుల్లో చేయాలి

చదువులకూ వైద్యానికి సదుపాయం కలగాలి
పల్లె దాటిపోకుండా అందరమూ బతకాలి
గాంధీజీ కలలుగన్న గ్రామరాజ్యమూ
మండలాల తేజరిల్లు రామరాజ్యమూ

*

(4.2.1987 ఒక డాక్యుమెంటరీ చిత్రం కోసం, శ్రీ ఉషాకాంత్ సంగీతపు స్వరాలకు సాహిత్యం కూర్పు)

# విద్యా వినయం

విద్యా వినయం వివేకాలతో
పిల్లకు వున్నా ఉద్యోగం
కట్నం ఇవ్వక పెళ్లికాని స్థితి
సమాజానికే దౌర్భాగ్యం ॥విద్యా॥

సంత సరుకుగా ఆడపిల్లకై
బేరాలాడుతు వున్నారు
పెళ్లి పేరుతో నిజముకు మగలే
అమ్ముడుపోతూ వున్నారు

కట్నం అంటూ కాకపోయినా
లాంఛనాలనీ పిలిచేరు
పింఛను బ్రతుకుల పిల్ల తండ్రికి
గుండెకోతనే పెంచారు ॥విద్యా॥

కలకంఠి కంట కన్నీరొలికిన
సిరియింట వుండదంటారు
పెళ్లి జరిగినా డబ్బు కోసమై
సాధిస్తూ వేధిస్తారు

సిరుల కోసమే కన్నె బతుకులో
ఉరులు పన్ని చితివేస్తారు
ఎటుపోతున్నది సభ్య సమాజం
అని ఎవ్వరు తర్కిస్తారు ॥విద్యా॥

ఆడపిల్లలే ఆర్థికస్వేచ్ఛతో
నిలబడి ధైర్యం పొందాలి
ధనదాహానికి బలికాకుండా
యువకులు జాగృతమవ్వాలి

తానూ ఒకింటి కోడలె కనుక
అత్తకు వివేకమవ్వాలి
సమతా మమతా యువతా కలిసి
వివాహసూత్రం నిలపాలి ॥విద్యా॥

*

(శ్రీ కె.బి.కె. మోహనరాజు ప్రధాన గాయకునిగా ఆకాశవాణి
ప్రభాతగీతం: 9.6.1989)

# పాడుకోడానికో పాట కావాలి

పాడుకోడానికో పాట కావాలి
హక్కుగా ప్రతివారు పనిపాటు పొందాలి
ఆడుతూ పాడుతూ కష్టించి దేశాన
అధిక సంపదలందు
ముందడుగు వేయాలి ॥పాడుకో॥

విద్యావకాశాలు పల్లవిగ రూపొంది
వృత్తివిద్యలు అనుపల్లవిగ అంది
పాదాలపై నిలుచు పాట సమకూరాలి
బ్రతుకు గీతానికో బాణీకట్టాలి ॥పాడుకో॥

పాటలేనిదె బ్రతుకు బాటయే లేదు
ఉత్పత్తి లేనిదే సంపదలు రావు
కార్మికుడు, కర్షకుడు, ఉద్యోగులందరూ
అక్షరాలా ప్రగతిగీతిలో కలవాలి
మన పాట విశ్వాన మార్మోగిపోవాలి ॥పాడుకో॥

*

(ఆకాశవాణి ప్రభాతగీతం 7.9.1990. సంగీతం: శ్రీ కృష్ణరంగం)

# బాలప్రపంచం మాది

బాల ప్రపంచం మాది
భావి ప్రపంచం మాది
భేదాలెరుగని తేడాలెరుగని
ఐక్య ప్రపంచం మాది
సమైక్య ప్రపంచం మాది ॥బాల॥

ఆటలు పాటలు చదువులు రాతలు
హక్కులు పిల్లలకి
వినయ వివేకాల్ భక్తీ శ్రద్ధలు
బాధ్యత లెల్లరికి

కుట్రలు కక్షలు కార్పణ్యాలకు
దూరం మా లక్ష్యం
శాంతి అహింసల సమైక్య భారత
వ్యవస్థ మా ధ్యేయం ॥బాల॥

రాం రహీమూ బుద్ధుడు నానక్
జీసస్ బోధల సారం
అన్ని భాషల అన్ని సంస్కృతుల
సాంప్రదాయ సుమహారం

మనకోసమెనని మంచికోసమని
మనసున నమ్మిన వారం
కలిసినడుద్దాం కొత్త శతాబ్దికి
అదిగో యుగద్వారం

*

(రచన: 2.10.1991, సంగీతం: శ్రీ కలగ కృష్ణమోహన్.
గానం: విజయవాడ విజ్ఞాన విహార్ ఇంగ్లీష్ మీడియం బాలబాలికలు,
ప్రసారం 14.11.1991, గం॥ 2.45 ని॥)

# మనసు పావన గంగ-2

మనసు పావన గంగ
మనసు గోదావరి
మలినమంటని మనసు
మధుర కవితా ఝరి

భాషలో ఏముంది
భావాలలో వుంది
వేషాన ఏముంది
చూచు తీరున వుంది

ఎవరు ఎవరైన
ఎదసొదలు ఒక్కటే
ఎరుక కలిగీ మనిషి
ఎగ్గువిడనాడితే ॥మనసు॥

కులములో ఏముంది
గుణములోనే వుంది
మతములో ఏముంది
మమతలోనే వుంది

పైకి భిన్నాలన్ని
లోన సున్నాలే
అట్టహాసపు జీవి
ఆత్మలోతంటితే ॥మనసు॥

వ్యాకులము తొలగించు
కరుణయే కులము
మమత పెంచుకు మసలు
మానవతె మతము

గదిలోన మదిలోన
ప్రతి మనిషి హృదిలోన
ఈ భావబిందువే
జనయించి సాగితే ॥మనసు॥

*

(బృందగానం 6.2.1984, సంగీతం: శ్రీ కృష్ణరంగం.
ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ఉదయం 7.15 ని.లకు)

# సమైక్య గీతం

ఇంద్రధనుసు రంగులన్ని
తెలుపులోంచి వచ్చేవే
సరిగమ పదనిసలన్నీ
నాదసుధను తెచ్చేవే ॥ఇంద్ర॥

ప్రవహించే నదులన్నీ
సంద్రంలో కలిసేవే
వికసించే పూలన్నీ
పూజలోన ఒకటేలే ॥ఇంద్ర॥

మతమంటే ఒక మార్గం మటుకే
అందరి గమ్యం ఒక్క చోటుకే
హిందూ ముస్లిం క్రైస్తవ పార్శీ
అందరి ప్రార్ధనా విశ్వశాంతికే ॥ఇంద్ర॥

కుట్రలు కక్షలు కార్పణ్యాలు
హింసాదోపిడి దౌర్జన్యాలు
నిరసించినవి అన్ని మతాలూ
ప్రగతికి పలికినవెన్నో హితాలూ ॥ఇంద్ర॥

బుద్ధుడు నానక్ క్రీస్తు మహమ్మద్
ఒకటే అందరి బోధలసారం
శాంతి అహింస కరుణా ప్రేమ
మనిషి బ్రతుకులో వెలుగుల హారం ॥ఇంద్ర॥

*

(సంగీతం: పి.వి. సాయిబాబా, గానం: బాలలు, బి.వి.బి.పి.ఎస్. బి.హెచ్.ఇ.ఎల్)

# తిమిరాలను భేదించే సమరాలే దీపాలు

తిమిరాలను భేదించే
సమరాలే దీపాలు
అజ్ఞానం అనైక్యతే
చీకటింటి శాపాలు

చుట్టూరా చీకటులను
తిట్టుకుంటు కూర్చొకు
ప్రయత్నించి ప్రతిహృదిలో
చిరుదివ్వెను వెలిగించు

ప్రతినారీ రూపెత్తిన
సత్యభామ ఆకారం
నరకాసుర సంహారం
దైనందిన వ్యవహారం

సాహసమే శోకాలను
తెగటార్చే ఆధారం
దీపావళి జరిగినపుడె
అంతరించు భూభారం ॥తిమిరాలను॥

తానూ తనదను తపనల
తహతహలే తమస్సులు
పదుగురికై ప్రగతిమార్గ
ప్రణాళికలె ఉషస్సులు

రోదనలూ వేదనలూ
తొలగించే హవిస్సులు
పేదరికం అధిగమించు
భాగ్య సూత్ర రోచిస్సులు ॥తిమిరాలను॥

భిన్నత్వపు తిమిరాల్లో
ఏకత్వం ఒక దీపం
నీరవనిశ్శబ్దంలో
సత్యవాక్కు ఒక దీపం

ఎదలోపలి ఎడారిలో
కరుణ బిందువొక దీపం
మనుగడలో మానవతే
మహిని వెలుగు ఘనదీపం ॥తిమిరాలను॥

కోపాలను తాపాలను
హరియించే సమభావం
గుండె గుండె వెలిగించే
స్నేహభావనా దీపం

కాంతిశాంతి కలబోసిన
క్రాంతిహేల చిద్రూపం
ఉజ్జ్వల చైతన్యమూర్తి
ప్రతి మనిషీ ఒక దీపం ॥తిమిరాలను॥

*

(ఆకాశవాణి లలిత సంగీత పాఠంగా ప్రసారం, నవంబర్ 1986, 3,10,17,24 సోమవారాల్లో ఉ॥ 7.15 ని. నిర్వహణ: శ్రీ చిత్తరంజన్ విద్యార్థిని: శ్రీమతి వినయమణి)

# తడబడకు....

తడబడకు వెనుబడకు
వడివడిగా అడుగిడు ముందుకు
వంతలతో చింతిలకు
పంతంతో మంచిపనులు కొంతయినా సాధించు ॥తడబడకు॥

రెమ్మ కొమ్మ పువ్వూ కాయ వేరు వేరు కాదు
చెట్టులోని వేవయినా
నువ్వూ నేనూ అతడూ ఆమె అంతా ఒకటే
భాషా మతము ఏవయినా ॥తడబడకు॥

ఆకాశం ఆశయాల ఎత్తు
అందరితో పెనవేసేయ్ పొత్తు
అలజడి ఆందోళనలూ చిత్తు
సుఖశాంతుల సౌభాగ్యం మన సొత్తు ॥తడబడకు॥

*

(సంగీతం: శ్రీ నల్లూరి సుధీర్ కుమార్, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం బృందగీతం 19.2.1986)

# ఎగరాలి ఎగరాలి

ఎగరాలి ఎగరాలి
ఎగరాలి జెండా
స్వేచ్ఛా సమానతలు
మన అండనుండ

మూడురంగుల జెండ
ముచ్చటైనా జెండ
మతము కులమేదైన
ఒకటిగా మనముండ ॥ఎగరాలి॥

త్యాగులూ తాత్త్వికులు
మహనీయమూర్తులూ
జనన మొందిన
పుణ్యధాత్రి మనదని తెలుప

మనది భారత జాతి
మనది ఘనకీర్తి
విశ్వశాంతికి స్ఫూర్తి
మన దేశమే నిలుప ॥ఎగరాలి॥

కలహించి హింసించి
ఐక్యతను త్రుంచక
కలబోసి ప్రేమలు
మానవత పెంచగా

ప్రగతి పంథాలలో
మనను నడిపించగా
భారతము భవ్యముగ
దివ్యముగ వెలుగా ॥ఎగరాలి॥

*

(సంగీతం: శ్రీమతి శోభారాణి, 1990 ఆగస్టు నెల పాఠశాల విద్యార్థుల కార్యక్రమంలో ఈ పాట నేర్చుకుందాంగా ప్రసారం)

# మధుర గీతి

మనసు మురియగ మధురగీతిని
పాడుతా ఈ వేళలో
గుండెలోపల గువ్వ పిట్టలు
రెక్కవిచ్చిన హాయితో

కొమ్మరెమ్మల తుహిన బిందువు
కంటనీరయి జారగా
సూర్యకిరణము సఖుడు తాకిన
అనునయమ్మె నిలువగా

తోడునీడా లేని వేళల
ఒంటిపాటున ఉలికిపడగా
తనివి తీరని తలపులెన్నో
ఎదను నిండీ సుధలు కురియగ ॥మనసు॥

రంగురంగుల లోకమంతా
జిలుగువెలుగుల పైటకాగా
శాంతి సుఖములు రోజురోజూ
నిన్ను నన్నూ అంటిరాగా

కనులు కనులకు మనసు మనసుకు
ఒకరికొకరుగ మనము కలియగ
జగము లోపలి అందమంతా
అందుకుని ఆనందమొందగ ॥మనసు॥

*

(రచన: 24.3.1988. సంగీతం: శ్రీ ఘంటసాల విజయ్‌కుమార్,
గానం: శ్రీమతి విజయలక్ష్మి శర్మ, ఈ మాసపు పాట)

# పొగగొట్టం పిలుస్తోంది

పొగగొట్టం పిలుస్తోంది
సైరన్ కూస్తోంది
పదరా పదపదరా
శ్రమియించే కార్మికా

ఎంచుము నిష్పత్తులు
పెంచుము ఉత్పత్తులు
నీ శక్తి నీ యుక్తి
జాతికి సంపత్తులు

గనిలోపల వనిలోపల
కార్ఖానా లోపల
జాగ్రత్తలు పాటిస్తే
ఉండవులే విపత్తులు ॥పొగగొట్టం॥

యజమానీ కార్మికుడూ
రెండుకళ్ళు ఫ్యాక్టరీకి
చేయీ చేయీ కలగలపి
కృషి చేసేయ్ విజయానికి

శ్రామికజన కల్యాణం
సంభవించు ప్రగతికి
ప్రగతిరథం చేరుతుంది
విశ్వశాంతి జగతికి ॥పొగగొట్టం॥

*

(సంగీతం: శ్రీ నల్లూరి సుధీర్ కుమార్, ఆకాశవాణి హైదరాబాద్
కార్మికుల కార్యక్రమం బృందగీతం, 13.9.1992)

# శ్రమయే ధనము

శ్రమయే ధనము  శ్రమ ఇంధనము
శ్రమశక్తే దేశప్రగతి సంసాధనము

పొలాలదున్నే కర్షకుడు
పరిశ్రమించే కార్మికుడు
పనిలోనే వున్నాడు
పూజించే దేవుడు

శ్రమను నమ్మి చెడిపోడు ఏ సాధకుడు
శ్రమదైవం సాక్షాత్తూ ఈ మానవుడు ॥శ్రమయే॥

ఉన్నవాడు లేనివాడే
శ్రమపడకుంటే
శ్రమశక్తిని అణగజూస్తే
మనసులోన మంటే

ఈ నిజాన్ని కనుగొంటే  కలసిమెలసి వుంటే
కర్మాగారాల నిండా  ఉత్పత్తుల పంటే ॥శ్రమయే॥

*

(సంగీతం: శ్రీ నల్లూరి సుధీర్ కుమార్, కార్మికుల కార్యక్రమంలో ప్రసారమైన బృందగీతం 26.3.1991)

# కంటి చూపులం

కంటి చూపులం, మింటి ఆశలం
అమ్మా నాన్నల కలల రూపులం

పిల్లలం మేం పిల్లలం
పిల్లలం మేం పిల్లలం
కొత్త శతాబ్దికి దూతలం
రేపటి కాలపు నేతలం ॥పిల్లలం॥

ఆటలు పాటలు విద్యాబుద్ధులు
అన్నీ నేర్చే తరుణం మాది
గొప్పా బీదా తేడాలేని
సమతాసమాజ ధ్యేయం మాది

రాబోవు యుగం మాది
ఆనంద జగం మాది
అందరు కోరే విశ్వశాంతికై
రెక్క విప్పిన స్వేచ్ఛ మాది ॥కంటి॥

పర్యావరణం, పచ్చదనం,
సాంకేతిక పరిజ్ఞానం
వీటన్నిటికీ వారసులం
ప్రగతి పాటకు పల్లవులం

చాచా చాటిన శాంతి,
మన నేతలు చూపిన కాంతి
పయనిస్తూ మరి రేపటికోసం
నేడు శ్రమించే క్రాంతికారులం ॥కంటి॥

*

(1998 నవంబర్ 14న ఆహుతుల సమక్షంలో పిల్లల ప్రత్యేక కార్యక్రమంలో ప్రసారం, సంగీతం: శ్రీ బంటి)

# తలపు తలుపు తట్టినంత

తలపు తలుపు తట్టినంత
తెరుచుకున్న ఆమని
జాబుకు ఒక జవాబులా
పలుకుతుంది ఏమని

ఇటురాకకు అటుపోకకు
రవళించే ప్రతి వేళకు
బతుకుదారి బహురూపుల
మారిపోవు ధరణి

తీపిచేదు కలగలసిన
అనుభూతుల సరణీ
వెళిపోయే ప్రతి ఒకటీ
ఒక జ్ఞాపకాల బరణీ ॥తలపు॥

ప్రతి ఉదయం సరికొత్తగ
పుట్టేదే హృదయం
కన్నీరూ చిరునవ్వూ
ముడివేస్తే అనునయం

సంధించిన ఆశే
త్వం మమేక శరణం
ఎర్రచివురు తోరణమే
జగతి తూర్పు కిరణం ॥తలపు॥

*

(రచనా కాలం 7.3.1996)
(ధాత ఉగాది 20.3.1996 సాయంత్రం 6.30 నుండి 8.30 వరకు రవీంద్రభారతి నుండి ప్రత్యక్ష ప్రసారమయిన ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం 'పూల పల్లకి' కార్యక్రమంలోని చివరి పాట)
(సంగీతం: ఆర్. గోపాలకృష్ణ, గాయనీ గాయకులు: వి. కనకదుర్గ, హెచ్. అశోక్ కుమార్, పి. నర్మద, కాసిం నూర్‌శేష. జి. దినకరరావు, ఎ. నాగేశ్వర రావు, సి. రమణి)

# ఏకాంతం తీగెమీద

ఏకాంతం తీగెమీద
విరహాశ్రువు జారింది
కలల సెగల మీద
కనుల తడిని ఆరవేసింది

మరపు తెరల మాటున
మధురోహలు నిదరోయి
నిట్టూర్పుల నీడతోనె
నడచి వచ్చెనో హాయి ॥ఏకాంతం॥

గతమంతా ఒక స్వగతం
వేదన సహజాతం
హఠాత్తుగా అదృశ్యం
వెన్నంటే సహచర్యం

తిమిరాలను ఛేదించే
దీపకళిక కద ధైర్యం
ఆగిపోదు బ్రతుకుబండి
గమనం అనివార్యం ॥ఏకాంతం॥

ప్రేమిస్తూ ఆ బాధలనే
తుదకంటా ప్రయాణం
బాధే సౌఖ్యమనే
భావనలోనే ప్రాణం

ఉలిదెబ్బల గాయాలతో
అనుభవాల హృదయం
మలచిన మానవమూర్తే
మహా జీవశిల్పం ॥ఏకాంతం॥

*

(ఆకాశవాణి విజయవాడ ఈ మాసపు పాట 1993
గానం: శ్రీమతి శిష్ట్లా శారదా వెంకటరమణ.
సంగీతం: శ్రీ డి.వి. మోహనకృష్ణ)

# కాలరేఖ

గుప్పిటలో ఇసుకలాగ
రాలిపోవు కాలం
కాలరేఖ అసాంతం
మహా ఇంద్రజాలం

ఎంత చక్కనయినా
గతమంతా ఒక స్వగతం
వర్తమానమనుసరించు
ఆగామికి స్వాగతం

ఏటికేడు ఎదలోపల
ఏదో ఒక సొదగా
మరపురాని మధురోహల
జీవధార సుధగా

ఆత్రంగా గాత్రంగా
భ్రమణ దివారాత్రంగా
చావుబ్రతుకు కలిపికుట్టు
ఉనికి మనికి సూత్రంగా ॥గుప్పిటలో॥

పీడకలల చీడనడల
జాడలు విదిలిస్తూ
ఆశల శైలూషిక
నర్తనాల పులకిస్తూ

గతవత్సర అనుభవాలు
గతులనింక సవరించును
నవవత్సర స్నేహకాంతి
నవజీవన మందించును ॥గుప్పిటలో॥

*

(రచన: 16.12.1994. లలిత సంగీత పాఠం
అధ్యాపకులు: శ్రీ మల్లిక్, విద్యార్థి: అనిల్‌కుమార్,
కళ్యాణిరాగం, ఆదితాళం,
ఆకాశవాణి విజయవాడ 9.1.1995, ఉదయం 7.45ని.లకు
శ్రీ మల్లిక్ పాడిన లలితగీతంగా ప్రసారం)



# కవి పరిచయం

**'సుధామ'**

**అసలు పేరు:** అల్లంరాజు వెంకటరావు

**జననం:** 25.11.1951

**తల్లిదండ్రులు:** శ్రీమతి అల్లంరాజు (ద్విభాష్యం) రాజేశ్వరమ్మ, కీ॥శే॥ అల్లంరాజు కామేశ్వర రావు

**విద్యాభ్యాసం:** బి.ఏ, యం.ఓ.యల్ (ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల, హైదరాబాద్)

ఎం.ఫిల్ (ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్సు కళాశాల, హైదరాబాద్)

'తెలుగు అభ్యుదయ కవిత్వంలో భావచిత్రాలు' (ఇమేజరీ ఇన్ ప్రోగ్రెసివ్ తెలుగు పొయెట్రీ) పై సిద్ధాంత రచన.

**వృత్తి:** కరీంనగర్ బిషప్ సాలమన్ జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్ (1975-1977)

1978 జూన్ 1న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో (వివిధ భారతి వాణిజ్య ప్రసార విభాగంలో) ట్రాన్స్‌మిషన్ ఎక్జిక్యూటివ్‌గా చేరిక.

1991లో ప్రోగ్రాం ఎక్జిక్యూటివ్‌గా పదోన్నతిపై ఆకాశవాణి విజయవాడ కేంద్రంకు బదీలి అయి, తిరిగి హైదరాబాద్, వరంగల్ కేంద్రాలలో పనిచేసి 2008 ఆగస్టు 1న ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం (వివిధభారతి వాణిజ్య ప్రసార విభాగం) నుండి కార్యక్రమ నిర్వహణాధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ.

**ప్రవృత్తి:** కవి, రచయిత, చిత్రకారుడు, కార్టూనిస్టు, సమీక్షకుడు, విమర్శకుడు, కాలమిస్టు, పజిల్స్ నిర్మాత, వక్త.

**ముద్రిత గ్రంథాలు:**

- వీచికలు (కవితా సంకలనం) (ఇరివెంటి కృష్ణమూర్తి, చక్రవర్తి వేణుగోపాల్, వంగపల్లి విశ్వనాథంలతో కలసి యువభారతి ప్రచురణగా) 1967
- మేం (కవితా సంకలనం) (మిత్రుడు డా॥ నాగినేని భాస్కరరావుతో కలిసి) 1974
- అగ్నిసుధ (కవితా సంకలనం) 1990
- సం.సా.రా.లు (సంస్కృతి-సాహిత్యం- రాజకీయాలు. ఆంధ్రభూమి దినపత్రిక ఎడిట్ పేజి మిడిల్ కాలమ్ వ్యాసాలు) 2001

- నవ్వుకుందాం, ఈసఫ్ నీతికథలు, పురాణ బాలలు, మన పండుగలు అనే పుస్తకాలు మానస ప్రచురణలు, విజయవాడ ప్రచురించినవి.
- ఇంకా కేంద్ర సాహిత్య అకాడమీ స్వాతంత్ర్యా నంతర 'తెలుగు కవిత', 'తరం తరం', 'కవితా ఓ కవితా', విశాలాంధ్ర 'కవితా దశాబ్ది' వంటి పలు కవితా సంకలనాల్లో కవితల ప్రచురణ.
- 'మహతి', 'తెలుగు పసిడి', 'శ్రీశ్రీ ప్ర.జ', 'రావిశాస్త్రి రచనాసాగరం' వంటి సంకల నాల్లో, కె. శివారెడ్డి, దేవిప్రియ, ఇస్మాయిల్, శీలావీర్రాజు, రావూరు, మండలి, పి.వి. నరసింహారావు లపై వచ్చిన సంచికల్లో వ్యాసాలు, ఇంటర్వ్యూలు ప్రచురణ.

**అవార్డులు-సన్మానాలు:**

- 'అగ్నిసుధ' (1990) (కవితాసంకలనం)కు కలహంసి అవార్డు (హైదరాబాద్), ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు (ప్రొద్దుటూరు, కడప).
- 'సం.సా.రా.లు' గ్రంథానికి 2004లో తెలుగు విశ్వవిద్యాలయంచే ఉత్తమగ్రంథం (ఇతరాలు)గా సాహితీ పురస్కారం.
- 'ఆరాధన' సంస్థ – తొలి ఆకాశవాణి – టివి అవార్డుల్లో శ్రీమతి శారదా శ్రీనివాసన్ గారితో బాటుగా ఆకాశవాణి అవార్డు (1995)
- 'మీడియా దంపతులు'గా శ్రీమతి ఉషారాణితో – కమలాకర్ ఛారిటబుల్ ట్రస్ట్ వారి 'విశిష్ట దంపతుల పురస్కారం' (1998)
- జ్యోత్స్నా కళాపీఠం ఉగాది కవితా పురస్కారం (2002)

- ‘అభినందన’ సంస్థ వారిచే ఉత్తమ స్నేహితులుగా డా॥ కె.బి. లక్ష్మితో బాటుగా పురస్కారం (2003)
- ఆచార్య తిరుమల స్మారక సాహితీ పురస్కారం (2005)
- ఇంకా అఖిల భారత కర్ణాటక మహాసభలు (బళ్లారి), ఆంధ్రా కల్చరల్ అసోసియేషన్ (భువనేశ్వర్) వారిచే 2006లో గెస్ట్ ఆఫ్ ఆనర్ సత్కారం, కృష్ణాజిల్లా రచయితల సంఘం వారి అఖిల భారత తెలుగు రచయితల మహా సభల్లో కవి సత్కారం. (2007)
- ‘చేతన’ మాసపత్రిక వార్షికోత్సవ విశిష్ట పురస్కారం (2007)
- వంశీ ఇంటర్నేషనల్ ఉగాది పురస్కారం (2008)
- కీ॥శే॥ తురగా కృష్ణమోహన రావు స్మారక పురస్కారం (2008)
- విశాఖపట్నం ‘స్నేహసంధ్య’ వారిచే సత్కారం (2009)
- హిందీ ‘మిలాప్’ దినపత్రిక, శంకర్ మెమోరియల్ ట్రస్ట్ వారిచే అఖిల భారతీయ కవి సమ్మేళనంలో తెలుగు కవిగా సన్మానం (2009)
- ఇంకా పలు సంస్థలచే సన్మానాలు – పురస్కారాలు ఎన్నో....

**ప్రస్తుతం:**

- డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ ఎం.ఏ. తెలుగు సెకండ్ ఇయర్‌కు మాధ్యమాల రచన గురించి పాఠ్య బోధన
- యువభారతి ప్రచురణల ప్రధాన సంపాదకుడు.
- కాలమిస్టుగా ఆంధ్రభూమి (దినపత్రిక) శుక్రవారాల్లో ఎడిట్ పేజీ మిడిల్ కాలమ్‌గా సం.సా.రా.లు (సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు) రచన.

* ఆంధ్రప్రభ (దినపత్రిక)లో ప్రతిరోజూ 'పదనిసలు'. వార్త దినపత్రిక ఆదివారం అనుబంధంలో 'పదరంగం'. ఆంధ్రభూమి మాసపత్రికలో 'పదమ వ్యూహం', రచన మాసపత్రికలో 'పజిలింగ్ పజిల్' గళ్లనుడి కట్టుల నిర్వహణ.
* ఆంధ్రభూమి వారపత్రికలో 'ఎ.బి.సి. ఆంధ్రభూమి సినిమాపజిల్', ఆంధ్రభూమి మాసపత్రికలో 'సంస్కృతీ ప్రహేళిక' పజిల్, ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో 'పూతరేకులు' చేతన మాసపత్రికలో 'వ్యంగ్య చేతన' శీర్షికల నిర్వహణ.
* ఈటీవి. 2 తీర్థయాత్ర కార్యక్రమానికి అడపాదడపా స్క్రిప్ట్ రచన.
* ఈనాడు, ఆంధ్రభూమి, వార్త, ప్రజాశక్తి, పాలపిట్ట వంటి వివిధ పత్రికల్లో పుస్తక సమీక్షలు, సాహితీ వ్యాసాలు మొదలైనవి.
* పలుసాహిత్య సభలు – సమావేశాల్లో శ్రోత మొదలుకొని ముఖ్య అతిథి, అధ్యక్షుని వరకూ వివిధ హోదాల్లో పాల్గొనడం.
* చదువుకోవడం, వ్రాసుకోవడం, తినడం, తిరగడం, పడుకోవడం అంతే!...

*

## మనసు పావనగంగ



కవి

**సుధామ**

జి.12, సాదత్ టవర్స్
పద్మావతి అపార్ట్‌మెంట్స్
సలీంనగర్ కాలనీ, మలక్‌పేట
హైదరాబాద్-500 036 (ఆం.ప్ర.)

040-24545780
9849297958

*